J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 16 22.9.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




# మహిళలే మహా'రాణులు'

## లోక్‌సభలో మహిళా బిల్లు ఆమోదం

## స్త్రీ శక్తి భారత్‌గా దేశ రాజకీయ భవిష్యత్

***అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆవిష్కరించబడిన నూతన పార్లమెంటు సాక్షిగా మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదింపబడింది... ఇక 2027 తరువాత చట్టసభల్లో ప్రతి మూడో సభ్యురాలిగా మహిళే ఉంటుంది. అంటే అకాశంలో సగమైన మహిళలకు... అవకాశాల్లో పరిపూర్ణత లభించినట్లే. మహిళా మణులకు లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో రిజర్వేషన్‌లు కల్పించేందుకు ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ బిల్లును మంత్రిమండలి ఆమోదంతో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేసింది మోడీ ప్రభుత్వం.***

**27** ఏళ్ళుగా పార్లమెంట్‌లో చట్టం రూపంలో ఆమోదం పొందేందుకు మహిళా బిల్లు తిరుగుతూనే ఉంది. నోరు మాట్లాడుతున్నా... నొసలు వెక్కిరిస్తోంది అన్నట్లుగా అన్ని పార్టీల మద్దతు ఉన్నప్పటికీ ఈ బిల్లు ఎందుకు ఆమోదం పొందలేకపోయింది అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న అయితే... దానికి సమాధానం మాత్రం అందరూ ఏకీభవించటం లేదు అన్న చిన్నమాటే. 1996లో దేవెగౌడ ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టి గీతా ముఖర్జీ నాయకత్వంలో 7 సూచనలు చేసిన తర్వాత నుంచి 1998, 1999, 2008, 2010... ఇలా పార్లమెంట్‌లోకి వచ్చినప్పటికీ చట్టంగా మారలేకపోయింది. ప్రస్తుతం మోడీ ప్రభుత్వం ఈ బిల్లును ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా మళ్లీ ముందుకు తీసుకొచ్చి 456 మందిలో 454 మంది చేత మద్దతుతో జై కొట్టించింది.

**"పట్టమేలే రాజు పోయెను, మట్టి కలిసెను కోట పేటలు,
పదం పద్యం పట్టి నిలిచెను కీర్తులపకీర్తుల్"**

నవయుగ కవితా వైతాళికుడు గురజాడ అప్పారావు రచించిన కన్యక అనే గేయంలోని చివరి పంక్తులివి. రాజులు పోతారు, రాజ్యాలు పోతాయి, అన్నీ మట్టి పాలు అవుతాయి. కానీ కీర్తి మాత్రమే సగర్వంగా తల ఎత్తుకుని నిలబడుతుంది. అపకీర్తి మాత్రం చరిత్ర హీనుణ్ని చేస్తుంది. కన్యక కావ్యం ఓ ఆడపిల్ల జీవితమే. చరిత్రలో మహిళలకు ఇలాంటి అవమానాలు ఎన్నో జరిగాయి. అంతకు మించి ప్రతిఘటనలు కూడా జరిగాయి. ఫలితంగా సతీ సహగమనం, బాల్య వివాహాలు వంటి దురాచారాలను నిర్మూలించుకోగలిగాం. ఇప్పుడు అదే దిశలో పడిన మరో అడుగు నూతన పార్లమెంట్ గడపకు మహిళా బిల్లు ఆమోదం కోసం వెళ్ళి ఆమోదింపబడింది.

10 లో

## ఆంధ్రా పాలిటిక్స్
## 2014కి ముందు.. ఆ తర్వాత!

సత్యపీఠం 4 లో...

## • కోర్టుల్లో బాబు కేసులు



## అటు జైలు.. ఇటు బెయిలు.. మధ్యలో సీఐడీ!

### గురువారం తీర్పులలో ఒకటి అనుకూలం.. మరొకటి వాయిదా! శుక్రవారం కీలకం!!

***స్కిల్‌స్కామ్‌లో సెప్టెంబర్ 9న ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు అయిన రోజు నుండి ఆయన జైలు, బెయిలు, సీఐడీ కస్టడీ కథ సస్పెన్సు థ్రిల్లర్ సినిమాలా నడుస్తోంది. వివిధ కోర్టులలో ఆయన కేసులు, వాదనలు, విచారణలు నడుస్తూనే ఉన్నాయి. తీర్పు వచ్చే ప్రతిసారీ ఉత్కంఠభరిత వాతావరణం కనిపిస్తూనే ఉంది. అరెస్టు అయిన పక్కరోజు అంటే 10వ తేదీ ఆయనని జ్యూడిషయల్ రిమాండుకు ఇచ్చే వరకూ కూడా ఇదే రకమైన సస్పెన్సు కొనసాగింది. సెప్టెంబర్ 22వ తేదీ శుక్రవారంతో అయన 14 రోజుల రిమాండ్ కూడా ముగుస్తుంది.***

ఎఫ్ఐఆర్ చెల్లదంటూ, కొట్టివేయాల్సిందిగా కోరుతూ చంద్రబాబు తరఫున లాయర్లు హైకోర్టులో వేసిన క్వాష్ పిటిషన్‌పై కూడా మంగళవారం నాడు వాదనలు ముగిసి, తీర్పు రిజర్వు చేశారు. శుక్రవారం లేదంటే సోమవారం ఆ కేసు తీర్పు వచ్చే అవకాశం ఉంది. శుక్రవారం హైకోర్టులో ఈకేసు బెంచిపైకి వస్తుందా లేదన్నది గురువారం రాత్రికి స్పష్టత వస్తుంది.

అయితే, ఆయనని 5 రోజుల కస్టడీకి ఇవ్వాలంటూ ఏపీ సీఐడీ, సీఐడీ కోర్టులో పిటిషన్ వేసింది. ఆ పిటిషన్‌పై 20వతేది బుధవారం వాదనలు ముగిసి గురువారం సాయంత్రం 4.00 గంటలకి తీర్పు వాయిదాపడింది. ఈ తీర్పు ఎలా వుండబోతుందోనన్న టెన్షన్ గురువారం సాయంత్రం చివరి నిముషం వరకూ అటు బాబు లాయర్లు, ఇటు సీఐడీ అధికారులతోపాటు తెలుగుదేశం పార్టీవర్గాలలో కూడా స్పష్టంగా కనిపించింది.

### కస్టడీపై తీర్పు వాయిదా ...!

సుదీర్ఘ సస్పెన్సు తరువాత చివరికి తీర్పు శుక్రవారం ఉదయం 10.30 గంటలకి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. ఈ కస్టడీ సస్పెన్సు శుక్రవారం ఉదయం వరకూ కొనసాగనుంది.

3 లో




## ఆ 'సమస్య' నుంచే..
## ఈ 'అవకాశం'

మనలో మాట 11 లో...

# అన్నదాతలకు అన్నీ కష్టాలే!

## - రైతు నాయకుడు కోటిరెడ్డి ఆవేదన



జిల్లాలో ధాన్యం రైతులకు ప్రతి సీజన్‌లోనూ కష్టనష్టాలే ఎదురవుతున్నాయని, ప్రభుత్వం ధాన్యానికి మద్దతుధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నప్పటికీ రైతులకు దళారుల బాధలు మాత్రం తప్పడం లేదని రైతుసంఘాల సమాఖ్య రాష్ట్ర నాయకుడు చిరసాని కోటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే ధాన్యాన్ని కొనుగోలు చేసేలా మిల్లర్లకు, వ్యాపారులకు అనుమతులివ్వాలని కోరుతూ ఇటీవల ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం ధర 60 రూపాయలుంటే, రైతులు ఆరుగాలం కష్టించి పండించే ధాన్యం ధర మాత్రం తగ్గుతోందని, దళారుల మాయాజాలంతో ఇప్పుడు ధాన్యం ధరను బాగా తగ్గించేశారని అన్నారు. ఇటీవలి వరకు కెఎన్ఎం 1638, కెఎన్ఎం 733 ధాన్యం రకాలను పుట్టి 22వేల రూపాయలకు, ఎంటీయు 1010 రకాన్ని పుట్టి 17,500 రూపాయలకు కొనేవారని, తాజాగా ఈనెల 1 నుంచి ఆ ధరను తగ్గించేసి కేవలం పుట్టికి 16వేల రూపాయలే ఇస్తున్నారని, ఇదెంతో అన్యాయమని అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు గమనించి, ధాన్యం అమ్మకాలను స్వయంగా పర్యవేక్షించాలని, రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కెవిఎన్‌ఆర్‌లో.. ఓజోన్ పరిరక్షణ దినోత్సవం




అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఇటీవల నెల్లూరులోని కెవిఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓజోన్ పొర ప్రాధాన్యతను వివరించారు. సూర్యుని అతినీలలోహిత కిరణాల ధాటినుంచి మానవాళికి రక్షణకవచంలా ఉండే ఓజోన్ పొర దెబ్బతినకుండా, పర్యావరణ పరిరక్షణకు అందరూ నడుంబిగించాలన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాలని, ప్లాస్టిక్‌కు బదులు గుడ్డసంచులు వాడుకోవాలని చెప్పారు. అనంతరం, 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్ వినయ్‌రామచంద్రన్ సూచనలతో, ముత్తుకూరు మండలంలోని కృష్ణాపట్నం సముద్ర తీరప్రాంతంలోని పరిసరాలను ఎన్‌సిసి కేడెట్లు శుభ్రపరచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హైస్కూల్, వెంగళరావు నగర్, ప్రభుత్వ ఆదర్శ ఉన్నతపాఠశాల ఎన్‌సిసి అధికారులు సీవీ నాగరాజు,పెంచలయ్య, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## పాదయాత్రగా వెళ్ళి..

# గొలగమూడిని దర్శించుకున్న సాయిభక్తులు



'ఉత్తరాదిన మా అన్న గుండం వేస్తుండ్లాయ్యా'..అని భగవాన్ వెంకయ్యస్వామి చెప్తుండేవారని వెంకయ్యస్వామి భక్తులు ఇప్పటికీ అంటుంటారు. 'దైవం మానుష రూపేణ' అన్నట్లుగా లోకకల్యాణం కోసం అవతరించిన భగవత్‌స్వరూపులు శ్రీ షిరిడీసాయి, శ్రీ వెంకయ్యస్వామి. మానవీయభావాలతో మాధవసేవతో పాటు మానవసేవను కూడా భక్తలోకానికి ప్రభోధించిన వీరిరువురూ సద్గురువులు..అవధూతమూర్తులే కనుక, సాయిభక్తులు షిరిడీ సాయితో పాటు, వెంకటాచలం మండలంలో వెలసివున్న శ్రీ గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయాన్ని కూడా దర్శించుకుంటుంటారు. ఈ నేపథ్యంలో ఇటీవల నెల్లూరులోని సాయిదర్బార్ అద్దాలమందిరం నిర్వాహకులు మధుసాయి ఆధ్వర్యంలో సాయిభక్తులు సుమారు మూడువందల మంది నెల్లూరు నుంచి గొలగమూడికి పాదయాత్రగా వెళ్ళారు. దారిపొడవునా 'ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి', 'ఓం నారాయణ-ఆదినారాయణ' అంటూ పెద్దపెట్టున నామోచ్చారణలు చేస్తూ, పండరి భజనలు, కోలాటాల కోలాహలంతో గొలగమూడికి చేరుకుని, ఆలయం చుట్టూ మహాప్రదక్షిణలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మధుసాయి తదితరులు వెంకయ్యస్వామివారికి భక్తిశ్రద్ధలతో పట్టువస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమకమిటీ సభ్యులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, వేమూరు కిషోర్, శ్రీధర్, నాగార్జుననాయుడు, సాయిదర్బార్ అద్దాల మందిరం కమిటీ సభ్యుడు బాబిసాయి, సాయిసేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మాలకొండకు

# రూ. 8.85 లక్షల ఆదాయం

జిల్లాలోని కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాలెం మాలకొండలో వెలసి వున్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవాలయానికి ఈనెల 16న శనివారం ఒక్కరోజే భక్తుల కానుకలు, ఇతరత్రా పూజలు, సేవల టిక్కెట్లు, ప్రసాదాల విక్రయం ద్వారా 8,85,200 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

## విద్యుత్‌శాఖ

# సిజిఎంగా.. రమణదేవి



జిల్లాకు చెందిన విద్యుత్‌శాఖ అధికారిణి రమణదేవికి ఉద్యోగోన్నతి లభించింది. ఏపిఎస్‌పిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (సిజిఎం)గా ఆమె ఇటీవల ఉన్నత బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్‌శాఖ జిల్లా సర్కిల్‌లో సుదీర్ఘకాలం ఆమె డెప్యూటీ ఇంజనీర్(డిఇటి)గా పని చేసి, ఉద్యోగోన్నతిపై కొద్దికాలం క్రితం తిరుపతి కార్యాలయం సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. తాజాగా ఆ శాఖ సిజిఎంగా మరోసారి ఉద్యోగోన్నతి పొందడంతో జిల్లాకు చెందిన విద్యుత్ అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## 60 బస్తాల

# రేషన్‌బియ్యం పట్టివేత



కొండాపురం మండలంలో అక్రమంగా తరలిస్తున్న 60 బస్తాల రేషన్ బియ్యాన్ని ఈనెల 16న పోలీసులు పట్టుకున్నారు. తూర్పు ఎర్రబల్లి గ్రామం నుంచి కావలికి రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారంతో నిఘాపెట్టి ఆ వాహనాన్ని గుర్తించి రేషన్‌బియ్యాన్ని, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని కొండాపురం ఎస్ఐ షేక్ ఖాజావలి తెలిపారు. ఆ వాహనం డ్రైవర్‌ను, అందులో ఉన్న సహాయకుడిని అరెస్ట్‌చేశామని పేర్కొన్నారు.

## ఎర్రన సాహిత్యంపై..

# 24న 'వేద విజ్ఞాన వేదిక' సభ

చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సెప్టెంబరు 24వ తేది సాయంత్రం 6.30 గంటలకు 'ఎర్రన సాహిత్య వైభవం'పై ఆంధ్రభాషా భూషామణి బిరుదాంకితులు ఆచార్య ప్రాచార్య శలాక రఘునాథశర్మ (రాజమండ్రి) ఉపన్యాసం ఏర్పాటుచేశామని, వేదిక అధ్యక్ష కార్యదర్శులు జెకె రెడ్డి, కందనూరు మధు తెలిపారు. చెన్నై టీనగర్‌లోని కృష్ణానగర్ ఆంధ్రా క్లబ్‌లో తాము నిర్వహిస్తున్న ఈ 141వ ఉపన్యాస ధారావాహిక కార్యక్రమానికి తెలుగుభాషాభిమానులు, సాహితీవేత్తలు తరలి రావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## బాంబ్ ఉందని బెదిరించిన..

# అగంతకుడు దొరికాడు



నెల్లూరు రైల్వేస్టేషన్‌లో బాంబ్ ఉందని, ఏ సమయంలోనైనా పేలిపోతుందంటూ ఈనెల 4వ తేదిన రైల్వేస్టేషన్‌కు ఫోన్‌చేసి అందరినీ హడలగొట్టి, పోలీసులను సైతం తప్పుదోవ పట్టించిన అగంతకుడు ఎట్టకేలకు దొరికాడు. అధికారులు బాంబ్‌స్క్వాడ్‌లతో హడావిడిగా పరుగెత్తుకుంటూ వచ్చి రైల్వేస్టేషన్‌లో అణువణువు గాలించి, చివరికి అది ఉత్తుత్తి ఫోన్ కాల్ అని నిర్ధారించిన విషయం తెలిసిందే! అయితే, రైల్వేస్టేషన్ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఈ బెదిరింపు ఫోన్‌కాల్ చేసిన అగంతకులెవరా అని పోలీసులు దృష్టిపెట్టారు. సాంకేతికత సాయంతో నిందితుడిని కనుగొన్నారు. అది అనుమసముద్రంపేట(ఏఎస్‌పేట) మండలంలోని పెద్దబ్బీపురం నుంచి వచ్చిన కాల్ అని, ఆ నంబరు వెంగళరావు అనే వ్యక్తిదని గుర్తించి అరెస్ట్ చేశారు. రైల్వే ఎస్ఐ హరిచందన కోర్టు అనుమతితో నిందితునిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిని పట్టుకున్నాక రైల్వే డిఎస్పీ మల్లికార్జునరావు తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి నిందితుని వివరాలను వెల్లడించారు. నెల్లూరులోని బార్లలో మద్యం సరఫరాచేసే వెంగళరావు మద్యం మత్తులో అందరినీ భయపెట్టేందుకు ఫోన్‌చేశాడని తేలిందన్నారు. ఎవరైనా ఇలాంటి బెదిరింపు ఫోన్‌కాల్స్‌కు పాల్పడితే సహించేది లేదని, చట్టప్రకారం కఠినచర్యలుంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో నెల్లూరు రైల్వే సిఐ కె.శ్రీనివాసాచారి, ఆర్‌పిఎఫ్ సిఐ బి.వసంత రావు, రైల్వే ఎస్ఐ ఎన్.హరిచందన తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో.. భగవాన్ విశ్వకర్మ జయంతి



శ్రీ విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు ఇటీవల నెల్లూరులో ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగాయి. నగరంలోని విరాట్‌నగర్‌లో ఉన్న శ్రీ గాయత్రీదేవి సమేత శ్రీ విశ్వకర్మ భగవాన్, గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నగర విశ్వబ్రాహ్మణ సేవా సంఘం పర్యవేక్షణలో, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కందుకూరు చెంగయ్య ఆచారి ఈ సందర్భంగా పంచవృత్తుల పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. విశ్వకర్మ భగవానుడు స్వయంభువుగా ఆవిర్భవించి సృష్టికార్యం నిర్వహించారని వేదాలు స్పష్టం చేస్తున్నాయని, నేడు మానవాళి వినియోగిస్తున్న ప్రతి వస్తువు కూడా విశ్వకర్మ సృష్టేనని ఆయన చెప్పారు. విశ్వకర్మ భగవాన్ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమంటూ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ ఆచారి, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రముఖులు అలిమేలి సుబ్రహ్మణ్యం, ఇందుకూరు రమేష్‌ఆచారి, దండపాణి సురేష్ ఆచారి, అద్దంకి చంద్రశేఖర్ ఆచారి, వెంకటేశ్వర్లు ఆచారి, కేసీ కృష్ణ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడలకు..

# మునిసిపల్ స్కూల్ విద్యార్థినులు



రాష్ట్రస్థాయిలో త్వరలో జరుగనున్న హ్యాండ్‌బాల్, రెజ్లింగ్ ఎంపిక పోటీల్లో నెల్లూరులోని బివిఎస్ మునిసిపల్ స్కూల్ విద్యార్థినులు తమ సత్తా చాటారు. అండర్-17 హ్యాండ్‌బాల్, అండర్-14 రెజ్లింగ్ విభాగాల్లో జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ వారు స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఎంపికల్లో ఆ స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థినులు ఉత్తమ ప్రతిభతో ఎంపికయ్యారు. హ్యాండ్‌బాల్ పోటీలకు 10వ తరగతి చదువుతున్న డి.మాలతి, కీర్తన, రెజ్లింగ్‌లో 9వ తరగతికి చెందిన జి.రేష్మ, ఎన్.శృతి, ఎస్ లాస్య(8వ తరగతి) ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.విజయజ్యోతి తెలిపారు. ఈనెల 19న పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన ఆ విద్యార్థినులను ఆమె అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్లు ఎం.రేవతి, పి. అజయ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## వెల్‌కమ్ సీఎం సార్..!

శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలకి విచ్చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తిరుపతి విమానాశ్రయంలో కలిసి స్వాగతం చెప్తున్న తిరుపతి జిల్లా వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, టిటిడి వైద్య ఆరోగ్య సలహాదారు డా. శ్వేత, శాసనమండలి సభ్యుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి.

## 'గురునిలయం'లో వెంకయ్యస్వామి ఆరాధన



నెల్లూరు మూలాపేటలోని గురునిలయంలో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవం ఈనెల 20న వేడుకగా జరిగింది. స్వామి శిష్యుడు మాకాని వెంకట్రావు తనయుడు గోపి, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో వెంకయ్యస్వామి శిష్యులు తుమ్మల తలుపూరు నారాయణదాసుస్వామి, గాలిపాళెంలోని వెంకయ్యస్వామి ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరి స్వామి తదితరులు పాల్గొని వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా గురునిలయంలో కొలువైవున్న శ్రీ వెంకయ్యస్వామికి కన్నులపండువగా పూలాలంకరణలు చేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. హోమగుండం పూజలు, అభిషేకసేవలు చేసిన తర్వాత, స్వామివారికి పెద్దఎత్తున నగరోత్సవం చేశారు. మధుసాయి బృందం వారు భజనగీతాలు ఆలపించారు. చిన్నారులు భక్తిపాటలకు నృత్యాలను ప్రదర్శించారు. ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులందరికీ అన్నప్రసాద వితరణ గావించారు.

## వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా వసుంధరాదేవి

నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ బి.వసుంధరాదేవిని నియమిస్తూ వైద్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు ఈనెల 20న ఉత్తర్వులిచ్చారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆమెకు ఇటీవల వైద్యవిద్య అడిషనల్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పించారు. ఇప్పుడు తాజాగా నెల్లూరు వైద్యకళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించారు.

## గురజాడకు 'అరసం' నివాళి



అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20న మహాకవి గురజాడ జయంతి వేడుకలు నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో ఘనంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి శివకుమార్ తదితరులు గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌరవాధ్యక్షుడు పెరుగు రామకృష్ణ, ఉపాధ్యక్షులు డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య, అవ్వారు శ్రీధర్‌బాబు, గోవిందరాజుల సుభద్రాదేవి, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, డైట్ లెక్చరర్ విజయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ అండ్ బి ఉద్యోగుల.. కొత్త కార్యవర్గం



రోడ్లు భవనాల (ఆర్ అండ్ బి) శాఖ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లాశాఖకు కొత్త కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా ప్రెసిడెంట్‌గా బెల్లంకొండ మస్తానయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి. మధు, కార్యదర్శులుగా ఎన్‌వి సురేష్, జాకీర్‌బాషా ఎన్నికయ్యారని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా, ఉపాధ్యక్షులుగా శ్రీలక్ష్మి, ఆర్ లక్ష్మమ్మ, కేవీ నారాయణ, జి.ప్రభాకర్‌రావు, డి. రాజారావు, జి.నాగేశ్వరరావు, అరుణ, సుబ్రహ్మణ్యం, శంకరమ్మ, వంశీకృష్ణ, మణికంఠ, బాల సుబ్రహ్మణ్యం, బాలసుందర్‌శర్మ, వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శులుగా రాజా నవీన్, కోశాధికారిగా పెంచలయ్య ఎన్నికైనట్లు పేర్కొన్నారు. నెల్లూరులోని ఆర్‌అండ్‌బి సర్కిల్ కార్యాలయంలో ఈనెల 20న జరిగిన సమావేశంలో ఈ ఎన్నికలు జరిగాయి. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునికేశవులు, గౌరవాధ్యక్షులు ఆర్‌వి రమణ, ప్రధాన కార్యదర్శి జి.రామమోహన్ సమక్షంలో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది.



## ఫుట్‌బాల్‌లో.. నెల్లూరు ఫస్ట్

ఫుట్‌బాల్ పోటీల్లో నెల్లూరు జోన్ జట్టు తన సత్తా చాటుకుంది. అత్యంత ప్రతిభతో ఆడి పలు జిల్లా జట్లను అధిగమించి విజేతగా నిలిచింది. దీంతో రాష్ట్ర స్థాయిలో కూడా విజేతగా నిలిచేందుకు జిల్లా జట్టు సమాయత్తమవుతోంది.

జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఏపీ స్టేట్ సింహపురి జోన్ ఫుట్‌బాల్ పోటీల్లో నెల్లూరు జట్టు విజేతగా నిలిచింది. జోన్ పరిధిలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్యజిల్లా, నెల్లూరుజిల్లాతో పోటాపోటీగా ఆడాయి. ఫైనల్స్‌లో అన్నమయ్య జిల్లాపై నెల్లూరు జిల్లా జట్టు విజయం సాధించింది. అన్నమయ్యజిల్లా ద్వితీయస్థానంలో నిలిచింది. విజేతలకు రాష్ట్ర వైకాపా సేవాదళ్ అధ్యక్షులు సుధీర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ క్రీడల్లో విజేతలు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగే సీనియర్ రాష్ట్రస్థాయి పోటీలకు ఈ జోన్ నుంచి అర్హత సాధించారని నిర్వాహకులు తెలిపారు.

## రాజరాజేశ్వరిదేవి అమ్మవారి హుండీల లెక్కింపు



నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 19న హుండీలు లెక్కించారు. ఈ ఏడాది జూన్ 21 నుంచి ఈ నెల 19 వరకు భక్తులు హుండీలద్వారా సమర్పించిన కానుకలు లెక్కవేయగా, ఆలయ హుండీల ద్వారా 27,09,409 రూపాయలు, అన్నదానం హుండీల ద్వారా 1,25,825 రూపాయలు వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. వాటితో పాటు ఒక సింగపూర్ డాలర్, అరబిక్ ధీరమ్స్ ఒకటి, సౌదీఅరబిక్ ఒకటి, యునైటెడ్ అరబిక్ ఒకటి హుండీల్లో లభించాయని పేర్కొన్నారు.




## ఢిల్లీ ధర్నాలో బీఎంఆర్

మహిళా రిజర్వేషన్ బిల్లులో 50 శాతం ఓబిసి మహిళలకు కేటాయించాలని న్యూఢిల్లీలో గురువారం జరిగిన 'బిసిల డిమాండ్ - ఛలో ఢిల్లీ' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ధర్నాలో రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు పాల్గొన్నారు. మహిళలకు చట్ట సభల్లో 33% రిజర్వేషన్ కల్పించడం శుభపరిణామమని... అయితే, అందులో 50 శాతం ఓబిసి మహిళలకు సబ్‌కోటా కేటాయిస్తూ బిల్లును సవరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## అర్హులందరికీ పథకాలు అందాలి

### డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి

జిల్లాలో అర్హులైనవారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని, అందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఏ పీడీ కెవి సాంబశివారెడ్డి ఆదేశించారు. ఈనెల 19న డిఆర్‌డిఏ కార్యాలయం నుంచి ఆయన డిపిఎంలు, ఏపిఎంలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పేదల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోందని, క్షేత్రస్థాయిలోని సిబ్బంది అందుకు తగ్గట్టుగా ఆయా పథకాలను అర్హులకు అందజేయాలని చెప్పారు. వైఎస్సార్ ఆసరా పథకానికి సంబంధించి మహిళలకు స్వయం ఉపాధి కోసం చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేందుకు 2 లక్షల నుంచి 10 లక్షల రూపాయల దాకా రుణాలివ్వడం జరుగుతుందని, అందుకోసం జిల్లాకు ప్రభుత్వం వెయ్యి యూనిట్లను కేటాయించిందని ఆయన తెలిపారు. అదేవిధంగా జగనన్న తోడు పథకానికి సంబంధించి చిరు వ్యాపారులకు 10వేల రూపాయల వడ్డీలేని రుణాన్ని బ్యాంకుల ద్వారా ఇప్పించడం జరుగుతుందని, అందుకోసం 15వేల యూనిట్లను ప్రభుత్వం జిల్లాకు కేటాయించిందని, అందుకు సంబంధించి అర్హులైనవారిని అధికారులు వెంటనే గుర్తించి, నమోదుచేయాలని ఆదేశించారు.

## జైలు - బెయిలు.. మధ్యలో సీఐడీ!

(మొదటి పేజీ తరువాయి)

### పుంగనూరు, అంగళ్ళు కేసులో ఊరట..!

గురువారం నాడు ఒక వైపు సీఐడీ కోర్టులో కస్టడీ పిటిషన్‌పై తీర్పు పెండింగ్‌లో ఉండగా మరోవైపు హైకోర్టులో పుంగనూరు, అంగళ్ల అల్లర్ల కేసులో అరెస్టు కాబడిన 79 మందితో పాటు మరో 30 మంది పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. చంద్రబాబు పుంగనూరు, అంగళ్ల పర్యటన నేపథ్యంలో జరిగిన రచ్చలకి సంబంధించి 79 మంది తెలుగుదేశం నాయకులని కార్యకర్తలని అరెస్టుచేసి గత 45 రోజులుగా కడప, చిత్తూరు, మదనపల్లి జైళ్లలో ఉంచింది ప్రభుత్వం. మరో 30 మందిని వేటాడుతుండగా వారంతా ముందస్తు బెయిలు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అరెస్టయిన 79 మందితో పాటు ముందస్తు బెయిలు కోసం అప్లై చేసుకున్నవారికి కూడా కండిషన్ బెయిలు మంజూరు చేస్తూ గురువారం హైకోర్టు తీర్పు వెల్లడించింది. ఈ తీర్పుతో 45 రోజులుగా వివిధ జైళ్లలో మగ్గుతున్న వారితో పాటు అరెస్టుని తప్పించుకోవడానికి దాక్కొని తిరుగుతున్నవారికి కూడా ఊరట లభించింది. ఒక వేళ చంద్రబాబు క్వాష్ పిటిషన్ కేసుపై తీర్పు శుక్రవారం వెలువడే పక్షంలో, ఇటు హైకోర్టులోనూ అటు సీఐడీ కోర్టులోనూ ఒకే రోజు నిర్ణయాలు జరిగే అవకాశం ఉంది. కాబట్టి, సెప్టెంబర్ 22 చంద్రబాబు కేసుల్లో చాలా కీలకం కానుంది.

జైలా, బెయిలా లేక సీఐడీ కస్టడీయా అన్నది మళ్ళీ సస్పెన్సుగానే మిగిలింది..!

లాయర్
సెప్టెంబర్ 22, 2023

# సంస్కారహీనం.. బూతుపురాణం

బూతు మాటలు.. రోత రాజకీయాలు ఇప్పుడు రాజ్యమేలుతున్నాయి. ముఖ్యంగా ఆంధ్రరాష్ట్రంలో ఈ విపరీత ధోరణి నానాటికీ పెరిగిపోతోంది. అనునిత్యం సామాజిక మాధ్యమాలలో వస్తున్న చాలామంది నాయకుల మాటలు చూస్తుంటే, మంచిమాట అనేది ఎప్పుడో మంటల్లో కలసిపోయిందని అర్థమవుతూ ఉంది. రాజకీయాలు ఇంతగా దిగజారిపోతున్నాయా?.. అనే ఆవేదన కలుగుతోంది. అసభ్యకర పదజాలంతో, నిందాపూరిత వ్యాఖ్యలతో ఒకరినొకరు దూషించుకోవడమే పని అన్నట్లుగా రాజకీయ నాయకులు సామాజిక మాధ్యమాల్లో వీరంగం చేస్తుండడం, నిర్లజ్జగా వ్యక్తిగత నిందలు, బూతుమాటలు వాడుతుండడం సామాన్య ప్రజలకు సైతం వెగటు పుట్టిస్తోంది. పార్టీ ఏదైతేనేం.. ఈ విషసంస్కృతి అంతటా పాకిపోతోంది. వ్యక్తిగత దూషణలైతే సిగ్గుతో తలదించుకునేంత దారుణంగా ఉంటున్నాయి. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన నాయకులే బరితెగించి మాట్లాడుతుంటే ఏమనుకోవాలి?..గతంలో ఎప్పుడూ ఇలాంటి దుస్థితి లేదు. ప్రజలన్నా, రాజకీయాలన్నా, నాయకులకు ఎంతో గౌరవభావం ఉండేది. ఇతర పార్టీల పట్ల భేదాభిప్రాయాలున్నా, ఏవైనా విమర్శలు చేయాలంటే నోరు అదుపులో పెట్టుకుని, ఆచితూచి మాట్లాడేవారు. ఒక్కమాట కూడా అభ్యంతరకరంగా ఉండేది కాదు. కొందరు నాయకులకైతే ఆయా ప్రాంతాల సమస్యల పట్ల అమోఘమైన పరిజ్ఞానం ఉండేది. అసెంబ్లీ టైగర్‌లనే అపూర్వమైన ఘనతను సాధించుకున్న మన ముప్పవరపు వెంకయ్యనాయుడు, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జైపాల్‌రెడ్డి వంటివాళ్ళు, అవినీతి మచ్చలేని డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి వంటి మహనీయ నేతలు, పాలనలో మేటిగా పేరెన్నికగన్న మర్రి చెన్నారెడ్డి, ఎన్‌టిఆర్ వంటి నాయకులు, కాస్తంత పాతకాలంలోనైతే పుచ్చలపల్లి సుందరయ్య వంటి ఉద్దండ రాజకీయనాయకులు.. ఇలా ఎందరో నాయకులు సమాజం పట్ల, పాలన పట్ల ఎనలేని గౌరవంతో ప్రజల మనసులను చూరగొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి చేయాల్సిన కార్యక్రమాల పట్ల సరైన అవగాహన, అధ్యయనం ఆ నాయకులకు అపారంగా ఉండేవి. అందుకే, వాళ్ల మాట్లాడుతుంటే ప్రజలు ఆ సభలకు తండోపతండాలుగా తరలివచ్చేవాళ్ళు. అసెంబ్లీలో వారేం మాట్లాడుతున్నారో ఆ మాటలు వినేందుకు సామాన్య ప్రజలు సైతం ఎంతో ఉత్సాహం చూపేవాళ్ళు. ఎదుటివాళ్ళను విమర్శించినా, మాటల్లో దురుసు కానీ, వ్యక్తిగత దూషణలు కానీ ఆ నాయకుల్లో ఉండేవి కావు. ఎంతటి క్లిష్టపరిస్థితుల్లోనైనా గౌరవప్రదమైన భాషనే ఉపయోగించేవాళ్ళు తప్ప, మాట తూలేవాళ్ళు కాదు. ఒకప్పట్లో డా. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రతిపక్షాలపై ఘాటైన రాజకీయ విమర్శలు గుప్పించినా, పాదయాత్రతో ప్రజల్లోకి వెళ్ళిన తర్వాత, రాజకీయాలకంటే ప్రజల సమస్యలపైనే ఎక్కువగా దృష్టిపెట్టి మహానేతగా గొప్ప పేరు సంపాదించుకున్నారు. ఇలా.. నాయకులనబడేవాళ్ల సమున్నతమైన భావాలతో, సమాజాభ్యుదయం కోసం సహేతుకమైన విమర్శలతో రాణించడమన్నది గత నాయకుల్లో చూశాం. అయితే, దురదృష్టం..నేటి రాజకీయాల్లో అలాంటి సత్సంప్రదాయాలన్నీ మట్టికొట్టుకుపోయాయా అనిపిస్తోంది. సమాజమంటే కనీస అవగాహన లేనివాళ్ళు, ప్రజల పట్ల బాధ్యత అన్నదే లేనివాళ్ళు, స్వార్థపరులు, అవినీతిపరులు, కబ్జాకోరులు, అక్రమార్జనపరులు, రకరకాల నేరస్తులు, క్రిమినల్ కేసుల్లో ఉన్నవాళ్ళు, రౌడీయిజమే సహజ లక్షణంగా కలవాళ్ళు కూడా రాజకీయాల్లోకొచ్చి రాజ్యమేలుతున్నారు. నాయకులుగా తాము బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నామనే స్పృహ అన్నదే లేకుండా, ప్రత్యర్థులను (అధికారపార్టీ కావొచ్చు-ప్రతిపక్షం కావచ్చు) నోటికొచ్చినట్లు బూతులు తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. వాళ్ళ అసభ్యపు మాటలు, బూతు కూతలు జనం వినలేకపోతున్నారు. ఇకనైనా ఈ తీరు మారాలి. రాజకీయాలు బూతుబురదలో కూరుకుపోకుండా సభ్యతా సంస్కారాలతో ఆదర్శవంతంగా ఉండాలి. నాయకులంటే ప్రజల దృష్టిల్లో హీరోల్లా ఉండాలి. వాళ్లను చూసి ప్రజలు గర్వపడేవిధంగా ఉండాలి. ఏ నాయకుడైనా సరే వాళ్ళు చేసే విమర్శలు సద్విమర్శలుగా ఉండాలి. రాజకీయాలతో సంబంధం లేని కుటుంబ సభ్యులపైన కూడా వ్యక్తిగత విమర్శలు, లేనిపోని నిందలు వేయడం సంస్కారవంతమైన పని కాదు. మాటలు సమాజానికి మంచిబాటలు వేసేలా ఉండాలి. స్వపక్షమైనా-విపక్షమైనా ప్రజా సమస్యలే పరమావధిగా, రాష్ట్రాభివృద్ధే తమ విధిగా ఎవరివంతు వాళ్ళు కృషిచేయాలే తప్ప, అదేపనిగా ఒకరినొకరు బండ బూతులు తిట్టుకుంటూ, వెకిలి వ్యాఖ్యలు చేసుకుంటూ కాలం గడిపేయడం వల్ల వాళ్ళకు వాళ్ళే చిన్నబోతారు! ఇది వారికే నష్టం.

## ఎస్వీబీసీ ఛానల్ నాణ్యత పెంచాలి

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

తిరుమల తిరుపతి దేవస్థానాల వారి ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీబీసీ ఛానల్ స్పష్టతలోనూ, ప్రసారం చేస్తున్న కార్యక్రమాలలోను నాణ్యత పెంచాలి. మొన్న 18వ తేదీ నుండి మొదలైన స్వామివారి బ్రహ్మోత్సవాలను ఇతర ఛానళ్లలో తిలకించడానికి టీటీడీ వారి సారథ్యంలో నడుపబడుతున్న శ్రీ వెంకటేశ్వర భక్తిఛానల్‌లో చూడడానికి స్పష్టతలో చాలా తేడా కనిపించింది. స్వామివారి వైభోగాన్ని, అక్కడ జరుగుతున్న వైభవాలను ఎప్పటికప్పుడు భక్తులకి చేరవేయడం కోసం ప్రారంభించిన ఛానల్ ఎస్వీబీసీ. ప్రస్తుత ఛైర్మెన్ భూమన కరుణాకర్‌రెడ్డి చొరవతో అప్పట్లో ఆ ఛానల్ ఆవిష్కృతమయ్యింది. అలాంటి ఛానల్‌లో వచ్చే కార్యక్రమాలను మిగిలిన టీవీ ఛానళ్లతో పోల్చిచుస్తే బాధకలుగుతోంది. స్వామివారికి నిధులకు కొరత లేదు. మారుతున్న కాలంతో పాటు అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికతను టీటీడీ కూడా ఉపయోగించుకుంటే బాగుంటుంది. ఇతర అనేక ఛానళ్లకు ధీటుగా ఎస్వీబీసీని కూడా డిజిటలైజ్‌చేసి, స్పష్టతతోపాటు ప్రసారమయ్యే కార్యక్రమాల స్థాయిని కూడా పెంచాలని ప్రస్తుత పాలకమండలి అధ్యక్షులు కరుణాకరరెడ్డికి మన 'లాయర్' ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. – లక్ష్మీభరద్వాజ్, హైదరాబాదు.

## జగన్ ప్రతిష్ట పెంచిన బాబు అరెస్టు..!

తాను మిష్టర్ క్లీన్ అని జబ్బలు చరుచుకుంటున్న చంద్రబాబుని అరెస్టుచేసి జగన్ మగాడనిపించుకున్నారు. తనను ఎవరూ టచ్ చేయలేరు అని విర్రవీగుతుండిన బాబుని కటకటాల వెనుకకు పంపడంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ట అమాంతం పెరిగింది. గతంలో ఆయన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీని ఎదిరించినప్పటికన్నా, తాజాగా ఆయన మీడియా దిగ్గజం రామోజీరావుకి చుక్కలు చూపించడం, ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీని అరెస్టుచేయడం వంటి విషయాలు జగన్‌ని హీరోగానిలబెట్టాయి. రాజకీయాలలో పవర్ ఉన్నవాడిదే రాజ్యం. అది జగన్ రుజువు చేస్తున్నారు.

ఎం.సుధాకరరెడ్డి, ఓర్లాండో, ఫ్లోరిడా, యుఎస్ఏ.

## పేదవాడికి దూరమవుతున్న వైద్యం!

దివంగత మహానేత డాక్టర్ రాజశేఖరరెడ్డి పుణ్యమా అంటూ పేదవాడికి అందుబాటులోకి వచ్చిన కార్పొరేట్ వైద్యం ఇప్పుడు దూరమైపోతుందా...? అన్న అనుమానం కలుగుతోంది. తమకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించడం లేదంటూ చాలావరకు కార్పొరేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ పరిధిలోనుండి తప్పుకున్నాయి. మరోవైపు అడుగడుగునా నిర్లక్ష్యంతో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది వైద్యం కోసం తమ వద్దకి వచ్చే రోగులను పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదులు వినపడుతూనేవున్నాయి. ఇలాంటి పరిస్థితులలో పేదవాడికి అవసరమైన వైద్యం దూరమైపోతోంది. ప్రభుత్వం ప్రైవేటు యాజమాన్యాలతో చర్చించి గతంలో ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న ఆసుపత్రులన్నిటినీ తిరిగి పేదవారికి అందుబాటులోకి తేవాలి. బటన్ నొక్కడంద్వారా లక్షల కోట్ల ప్రజాధనాన్ని పేదవాళ్ళ ఖాతాలలోకి పంపిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి, వారి ఆరోగ్యాలకు కూడా రక్షణ కల్పించాలి. తమ తండ్రి మానసపుత్రిక ఆరోగ్యశ్రీ పథకం అటకెక్కకుండా కాపాడాలి.

కే.సుదర్శన్‌రెడ్డి, తిరుపతి.




# ఆంధ్ర పాలిటిక్స్ 2014కి ముందు.. ఆ తర్వాత!

ఆంధ్ర రాజకీయాలు 2014కి ముందు 2014 తరువాత, అంటే రాష్ట్రం విడిపోక ముందు, ఆ తరువాత అన్నట్లుగా మారిపోయాయి. ఉమ్మడి రాష్ట్రంలో 1982లో రామారావు తెలుగుదేశం పార్టీ పెట్టకముందు ఆంధ్రా రాజకీయాలలో కాంగ్రెస్‌పార్టీదే హవా. తెలుగుదేశం పార్టీ స్థాపించి దేశవ్యాప్తంగా తెలుగువారికి గుర్తింపు తేవడమే కాకుండా, రాష్ట్ర రాజకీయాలపై ఉత్తర భారతదేశపు పెద్దల పెత్తనానికి చెక్‌పెట్టిన ఘనత ఎన్టీఆర్‌దే. నేషనల్ ఫ్రంట్ ద్వారా 1989–91 మధ్య కాలంలో భారతదేశంలో ఇతర రాష్ట్రాలలో ఉన్న అనేక ప్రాంతీయపార్టీలను కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా ఒక వేదికపైకి తేవడంలో ఎన్టీ రామారావు కృషి చాలావుంది. నేషనల్ ఫ్రంట్ అధ్యక్షుడిగా నందమూరి ఉండడంతో జాతీయస్థాయిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దేశ రాజకీయాలలో ప్రాధాన్యత ఏర్పడింది. తెలుగు రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీల హవా కూడా అప్పటినుండే మొదలయ్యింది. ఈరోజు తెలంగాణలో చక్రం తిప్పుతున్న కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రాంతీయపార్టీ పెట్టడానికి తెలుగుదేశమే స్ఫూర్తి అని చెప్పడానికి సంశయం అవసరం లేదు. తరువాతి కాలంలో రామారావుని చూసి వాత పెట్టుకున్న చిరంజీవి తన ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి ఢిల్లీకి గులాంగా మారిన సంగతి తెలిసిందే.

రాజశేఖరరెడ్డి జీవించి ఉండి ఉంటే ఏమయ్యేదో తెలియదు కానీ, ఉమ్మడి రాష్ట్రం ముక్కలవ్వడంతో పాటు రాష్ట్రంలో మరో రెండు ప్రాంతీయపార్టీల ఆవిర్భావానికి మాత్రం ఆయన మరణం కారణమయ్యింది. రాష్ట్రాన్ని విడగొట్టడంలో కీలకపాత్ర పోషించిన కాంగ్రెస్‌పార్టీ ఆంధ్రాలో భూస్థాపితమైపోయింది. బహుశా ఇక ఆ పార్టీ ఇప్పట్లో ఆంధ్రప్రదేశ్‌లో బ్రతికి బట్టకట్టడం కలే. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి, ఆంధ్రా అనాథగా మారడానికి ముఖ్య కారణం కాంగ్రెస్ అయితే, ఆ పాపంలో బీజేపీ కూడా పాలుపంచుకుంది. కాబట్టి ఆ రెండు జాతీయపార్టీలూ ఇంకా తెలంగాణలో మాత్రం మనుగడ సాగిస్తున్నాయి.

### ఆంధ్రాలో అన్నీ ప్రాంతీయ పార్టీలే...!

ఆంధ్రాలో ఇప్పుడు కాంగ్రెస్ లేదు. బీజేపీ ఉన్నా, లేనట్టే. ఇక రాష్ట్రంలో మిగిలింది మూడే పార్టీలు. వైసీపీ, టీడీపీ, జనసేన మాత్రమే. అవి మూడూ ప్రాంతీయ పార్టీలే. మార్చి14, 2014న పురుడు పోసుకున్న జనసేన, ఆ ఏడాది జరిగిన ఎన్నికలలో మాత్రం పోటీ చేయకుండా టీడీపీ, బీజేపీలకి అండగా నిలిచింది. ఆ తరువాత 2019లో జరిగిన ఎన్నికలలో ఆ రెండుపార్టీలతో సంబంధం లేకుండా పోటీచేసి ఘోర పరాజయాన్ని పొందింది. ఆ తరువాత రోజుల్లో జనసేన చాప చుట్టేస్తుందని చాలామంది భావించారు. కానీ, అలా జరగలేదు. తమ్ముడు కళ్యాణ్ కూడా అన్నలాగే జాతీయపార్టీకి సలాం కొట్టి మళ్ళీ బీజేపీతో జతకట్టాడు. పూర్తి స్థాయి రాజకీయాలలో లేకపోయినా సమయం దొరికినప్పుడల్లా నేనున్నానంటూ వచ్చి మైకులు, మీడియాల ముందు తన ఆవేశాన్ని ప్రదర్శించి మాయమైపోతున్నాడు. ఇప్పుడు తాజాగా చంద్రబాబు అరెస్టు అయిన తరువాత, రాబోయే ఎన్నికలలో తాము టీడీపీతో కలిసి పోటీచేయబోతున్నామని తొలిసారిగా ప్రకటించాడు పవన్.

### రాష్ట్రం విడిపోక ముందూ... ఆ తరువాతా అన్నట్లుగా ప్రస్తుత రాజకీయాలు..!

ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు 2014 వరకూ రెండే ప్రధాన పార్టీలు. ఒక జాతీయ పార్టీ, ఒక ప్రాంతీయ పార్టీ. కాబట్టి అప్పట్లో రాజకీయ కక్షలు, కులాధిపత్యాలు, అహంకారపూరిత పోకడలు ఉండేవికాదు. రాజకీయ నాయకుల మధ్య విమర్శలు ప్రతివిమర్శలు ఉంటే అవి ఎన్నికల వరకే పరిమితమయ్యేవి. ఆ తరువాత సృహృద్భావ వాతావరణంలో అందరూ కలిసి పనిచేసుకునేవారు. రెండు పార్టీలలోనూ పరిపక్వత కలిగిన నేతలు విలువలతో కూడిన రాజకీయాలు చేసేవారు. గతంలో పనిచేసిన ముఖ్యమంత్రులూ, మంత్రులూ ఎవరూ సచ్చీలురేమీ కాదు. ఏ కొద్దిమందో తప్ప అందరూ ఎవరికితగ్గ స్థాయిలో వాళ్ళు అవినీతి చేసినవాళ్ళే. కానీ, ఎవరు అధికారంలోకి వచ్చినా రెండవవాళ్లపై కక్షసాధింపు చర్యలకి పాల్పడడం, జైళ్లలో పెట్టించడం వంటివి జరగలేదు. కూటికి టిఖానా లేకుండా కోట్లకి పడగలెత్తిన వాళ్ళు కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ పార్టీలలో కూడా ఉన్నారు. కానీ, అధికారాలు మారాక వారెప్పుడూ ఒకరి లొసుగులు ఒకరు లోడుకోలేదు. 2014లో రాష్ట్రం విడిపోయిన తరువాత సీన్ అదికాదు. వ్యక్తిగత ఆధిపత్య పోరాటాలకు రాజకీయాలు వేదికగా మారిపోయాయి. అందరూ స్థానికులే కావడంతో, వర్గవిభేదాలు రాజకీయ వైషమ్యాలుగా అవతరించాయి.

### కొత్త ఒరవడి...!


చంద్రబాబు అరెస్టుతో పరిస్థితులు మారాయి. ఆంధ్రా రాజకీయాలలో కొత్త ఒరవడికి అంకురార్పణ జరిగింది. చంద్రబాబుని అరెస్టు చేయడం చాలామందికి సంతోషాన్ని కలిగించి ఉండొచ్చు. అనేక మంది కసి తీరి ఉండొచ్చు. ఒక సామాజిక వర్గం లక్ష్యం నెరవేరి ఉండొచ్చు. మరో సామాజిక వర్గం కడుపు మండుతుండొచ్చు. కానీ, ఆంధ్రా రాజకీయాల ట్రెండు మారిందని చెప్పడానికి బాబు అరెస్టు ఒక ఉదాహరణగా రాష్ట్ర చరిత్రలో మిగిలిపోతుంది. తమిళనాడుతో పాటు ప్రాంతీయ పార్టీలు ఆధిపత్యం వహిస్తున్న అనేక ఇతర రాష్ట్రాల సంస్కృతికి ఇప్పుడు ఆంధ్రాలో సైతం బీజంపడింది. రాజకీయాలలో రేపు ఏం జరగబోతోందో ఎవరికీ తెలియదు. ఎప్పుడు ఎవరుఎవరికి శత్రువులుగా ఉంటారో, మిత్రులుగా మారతారో ఊహించడం అసాధ్యం. అలాంటి పరిస్థితులలో ఈ అరెస్టుల సంప్రదాయం మంచిదికాదు. ఆ పని ఏ పార్టీ చేసినా తప్పే. ఈ సంస్కృతి వల్ల వివాదాలు పెరుగుతాయి. విద్వేషాలు చెలరేగుతాయి. కక్ష్యలు, కార్పణ్యాలు ఏర్పడుతాయి, రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుంది. విజ్ఞత, విచక్షణ కలిగిన నేతలు ఈ వాస్తవాలను గ్రహిస్తే, రాష్ట్రానికి ప్రజలకి మంచి జరుగుతుంది...!

- రాజశ్రీ

• నాన్న బాటలో కొడుకు

కొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టిన

# సింధూర రామచంద్రారెడ్డి తనయుడు శమంత్



## తానే వచ్చి బంధుమిత్రులను కలుసుకున్నాడు

### క్యాన్సర్ ఆసుపత్రికి 2 లక్షల విరాళం అందజేశాడు

సెప్టెంబర్ 13వ తేదీన చెన్నైలో తుదిశ్వాస తీసుకున్న నెల్లూరీయులైన ప్రముఖ డాక్టర్ సింధూర రామచంద్రారెడ్డి కుమారుడు శమంత్, తమ నాన్న నిరాడంబరతకి తగ్గట్లుగా కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టి తండ్రికి తగ్గ తనయుడనిపించుకున్నాడు. రామచంద్రారెడ్డి కన్ను మూసిన తరువాత ఆయన కోరిక మేరకు ఆయన దేహాన్ని రామచంద్రా మెడికల్ కాలేజీకి ఇచ్చేశారు కుటుంబసభ్యులు. ఆయన విల్లులో రాసినట్లుగా దశదిన కర్మ కూడా చేయలేదు. మామూలుగా ఎవరైనా కాలం చేస్తే వాళ్ళింటికి విచారింపు పేరుతో బంధుమిత్రులు వచ్చి పరామర్శించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. అయితే, ఆ ఆనవాయితీని పక్కనపెట్టి రామచంద్రారెడ్డి కుమారుడు శమంత్ ఇటీవల నెల్లూరుకు వచ్చి తానే బంధుమిత్రులందరినీ కలసి వెళ్ళాడు. పనిలో పనిగా నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి తన నాన్న పేరుమీద రెండు లక్షల విరాళాన్ని ఇచ్చాడు. క్యాన్సర్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. ఎం.నాగేశ్వరరావు, చీఫ్ మెడికల్ అధికారి డా. టి.లక్ష్మిలను కలసి 2 లక్షల రూపాయల చెక్కును అందజేశాడు.

శమంతకమణి గురించి మనం పురాణాల్లో చదువుకున్నాం. ఆ మణి ఎక్కడ ఉంటే అక్కడ అంతా సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉంటుందని ప్రతీతి. శమంతకమణి ఆధారంగానే రామచంద్రారెడ్డి తన కుమారుడికి ఆ పేరు పెట్టుకున్నారని ఆయనే పలు సార్లు ఆయన మిత్రుల దగ్గర చెప్పారు. ఉన్నత చదువులు చదివి అమెరికాలో స్థిరపడినా, తన తండ్రి ఆశించినట్లుగా శమంతకమణిలా ప్రత్యేక గుణాలు కలిగి తండ్రికి తగ్గ తనయుడనిపించుకుంటున్న శమంత్‌కి 'లాయర్' హ్యాట్సాఫ్ ...!

పాలమూరు

ఎత్తిపోతల పథకంపై..

# సిఎం మౌనం వీడాలి

- బీజేపీ నాయకుడు మిడతల



పాలమూరు ఎత్తిపోతల పథకానికి అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేదని, తెలంగాణ సర్కార్ చట్టవ్యతిరేకంగా ఆ ప్రాజెక్టును కొనసాగిస్తూ ఉంటే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారని బీజేపీ నాయకుడు, నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నప్పుడు 2016లో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి వ్యతిరేకంగా కర్నూలులో దీక్ష చేసిన జగన్మోహన్‌రెడ్డి నేడు మౌనంగా ఉండడం సముచితం కాదన్నారు. ఆంధ్రప్రదేశ్ నీటి హక్కులు హరించుకుపోతుంటే ఆ సమస్య తమకేమీ పట్టనట్లు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు.

శ్రీశైలం జలాశయంలో 834 అడుగుల కంటే నీటి నిల్వ తక్కువగా ఉన్నప్పుడు కేవలం త్రాగు నీటి అవసరాలకు నీరు ఉపయోగించవలసి ఉంటుందని, కానీ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం శ్రీశైలంలో 800 అడుగుల స్థాయిలోనే నీటిని తరలించుకుంటుండడం వల్ల, దాని ప్రభావం తెలుగు గంగ, హంద్రీ-నీవా, గాలేరు నగరి, వెలిగొండ ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకంలో పడిందన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్ మౌనం వీడి రాష్ట్ర నీటి హక్కులను, ప్రజల ప్రయోజ నాలను కాపాడాలని ఆయన కోరారు.

# రాష్ట్రంలో వైకాపా అరాచక పాలన

## -- మంత్రి ఆనం రామనారాయణ ఆరోపణ --



రాష్ట్రంలో వైకాపా అరాచక పాలన చేస్తోందని మాజీమంత్రి, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి ఆరోపించారు. చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్ట్ చేశారంటూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల ఆత్మకూరు బస్టాండు సెంటర్‌లో రిలే దీక్షలు జరిగాయి. ఈ ఆందోళనలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నాయకునిగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్ట్ చేసి రాజమండ్రి జైల్లో ఉంచడం దారుణమన్నారు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేకున్నా, 73 ఏళ్ళ వయసున్న చంద్రబాబును హింసపెట్టడాన్ని ఆంధ్రప్రజలు సహించరన్నారు. అనాగరికమైన అసత్యప్రచారాలు చేస్తూ సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతున్న మాటలు ఎబ్బెట్టుగా ఉన్నాయని, రానున్న రోజుల్లో వైకాపా ప్రభుత్వానికి ప్రజలు తగు గుణపాఠం చెప్తారని అన్నారు. నాయకులు దావా వెంకట్రావు, చంద్ర వెంకటసుబ్బానాయుడు, జిల్లా టీడీపీ నాయకుడు కేతా విజయభాస్కర్‌రెడ్డి, ఆత్మకూరు మాజీ వైస్ ఛైర్మెన్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుపై నిందలు దారుణం

## మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి



మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడుపై వైకాపా ప్రభుత్వాధికారులు లేనిపోని నిందలు వేయడం దారుణమని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇటీవల ఆయన మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, సీఐడీ చీఫ్, ఏఏజీలు ప్రెస్‌మీట్లు పెట్టిమరీ చంద్రబాబుపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు. హుందాగా వ్యవహరించాల్సిన అధికారులు ఇలా తయారుకావడం విచారకరమన్నారు. చంద్రబాబు పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి వైకాపా నేతలు ఓర్వలేకపోతున్నారని, చంద్రబాబుపై కక్షసాధిస్తున్నారని, 45 ఏళ్ల రాజకీయ జీవితం, ఎమ్మెల్యేగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం ప్రజలకు సేవలు అందించిన చంద్రబాబు నాయుడిని తప్పుడు కేసులో జైలులో పెట్టడం ఘోరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# విఎస్‌యుకి 'న్యాక్'నుంచి ఏ-గ్రేడ్





నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు)కి తొలిసారిగా మంచి గుర్తింపు వచ్చింది. ఎంతో ప్రతిష్టాత్మకమైన నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (న్యాక్) నుంచి ఏ-గ్రేడ్ లభించింది. ఆమేరకు విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జి.ఎం సుందరవల్లికి ఇటీవల న్యాక్ అధికార వర్గాల నుంచి సమాచారం అందడంతో యూనివర్శిటీలో హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. వర్శిటీకి ఎంతో ప్రతిష్టాత్మకమైన న్యాక్ ఏ-గ్రేడ్ రావడం గర్వకారణమని వీసీ ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. 2008వ సంవత్సరంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి నెలకొల్పిన ఈ యూనివర్శిటీ అనేక సమస్యల సవాళ్ళను అధిగమిస్తూ ఇటీవలి కాలంలో 2ఎఫ్, 12బీ వంటి గుర్తింపులను సమకూర్చుకుని ఇప్పుడు ఏ-గ్రేడ్ స్థాయికి చేరిందన్నారు. తాను వైస్-ఛాన్సలర్ గా బాధ్యతలు చేపట్టాక వర్శిటీకి ఎలాగైనా న్యాక్ గుర్తింపు తీసుకురావాలనే సంకల్పంతో సిబ్బంది అందరి సమిష్టి కృషితో ముందుకు సాగామన్నారు. విఎస్‌యులో అనేక భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనతో విశ్వవిద్యాలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడం జరుగుతోందని, మంచి బోధనతో పాటు విశ్వవిద్యాలయ పరిపాలన తీరు, చేస్తున్న సేవలు అన్నిటినీ గుర్తించి న్యాక్ ఏ-గ్రేడ్ ఇచ్చిందని వీసీ చెప్పారు.

### సిఎం సహకారం మరువలేనిది :

విఎస్‌యు అభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వీసీ సుందరవల్లి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. విఎస్‌యు కోసం ఎప్పుడు ఏ అనుమతి అడిగినా మంజూరు చేస్తున్న సిఎం సహకారం మరువలేనిదన్నారు. అదేవిధంగా విఎస్‌యుకి అన్నివిధాలా చేయూతనందిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, నిధుల సమీకరణలో భాగంగా ఎంపీ ల్యాడ్ నుంచి నిధులను కేటాయించిన రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి, తిరుపతి ఎంపీ గురుమూర్తికి ఆమె ఈ సందర్భంగా ధన్యవాదాలు చెప్పారు. విశ్వవిద్యాలయానికి మంచి గ్రేడ్ వస్తే ఎన్నో లాభాలున్నాయని, పలు కేంద్రసంస్థలు, రాష్ట్ర సంస్థల నుంచి పరిశోధన, బోధనల అభివృద్ధికి పుష్కలంగా నిధులు లభిస్తాయని ఆమె తెలిపారు. జాతీయనూతన విద్యావిధానం అమలులోకి వచ్చిన తరుణంలో న్యాక్ గ్రేడ్ వల్ల స్వయం ప్రతిపాదిత కోర్సుల నిర్మాణానికి ఎంతో ఉపయోగమన్నారు. దూర

○ అభివృద్ధికి ఇక పుష్కలంగా నిధులు

○ యూనివర్శిటీలో హర్షాతిరేకాలు

విద్యా కేంద్రం కోర్సుల నిర్మాణం స్వతహగా చేసుకొనేందుకు అవకాశం లభించే వీలుందన్నారు. న్యాక్ గుర్తింపు వల్ల కేంద్రం నుండి రూసా నిధుల క్రింద 20 కోట్ల రూపాయల మేరకు నిధులు సమకూరే అవకాశం ఉందని, దాంతో వర్శిటీలో మరిన్ని సౌకర్యాలను మెరుగుపరచి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. దూర విద్యాకేంద్రంతో పాటు ఆన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్ సదుపాయాన్ని కూడా విద్యార్థులకు అందించే అవకాశం ఉందని, ఆ దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. కావలిలోని వర్శిటీ కళాశాల 78 ఎకరాల క్యాంపస్‌తో విశాలంగా ఉంటుందని, త్వరలో ఆ క్యాంపస్‌ని ఫార్మసీ కళాశాలగా మార్చే ఆలోచన ఉందని పేర్కొన్నారు వర్శిటీకి ప్రస్తుతం సమకూరిన న్యాక్ ఏ-గ్రేడ్ ఐదేళ్ల పాటు అమల్లో ఉంటుందని, తదుపరి సైకిల్‌లో మరింత ఉన్నత గ్రేడ్ సాధించే దిశగా వర్శిటీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. న్యాక్‌లో మంచి గ్రేడ్ రావడమే లక్ష్యంగా కృషిచేసిన వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.రామచంద్రారెడ్డిని, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.విజయానంద్ బాబును, ఐక్యూఏసీ డైరెక్టర్ ఆచార్య అందె ప్రసాద్, వర్శిటీ న్యాక్ డైరెక్టర్ ఆచార్య సుజా ఎస్ నాయర్‌లను ఆమె ఈ సందర్భంగా అభినందించారు.

# నెల్లూరు కబుర్లు

## వెనుకబడిన కులాల వారికి అండగా..

# 'వైఎస్సార్ కాపునేస్తం'

### జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



వైఎస్ఆర్ కాపు నేస్తం పథకం ద్వారా రాష్ట్రంలో 45 నుంచి 60 ఏళ్లలోపు ఉన్న కాపు, బలిజ, ఒంటరి మరియు తెలగ కులాల లబ్ధిదారులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా నాల్గవ విడతలో ఒక్కొక్కరికి 15 వేల రూపాయల చొప్పున ఈనెల 16న రాష్ట్రంలోని 3,57,844 మందికి ఆర్థిక సహాయం క్రింద నిధులు విడుదల చేశారని జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. వైఎస్ఆర్ కాపు నేస్తం 4వ విడత కింద రాష్ట్ర వ్యాప్తంగా 3,57,844 మంది కాపు, బలిజ, ఒంటరి మరియు తెలగ కులాల లబ్ధిదారులకు 536.766 కోట్ల రూపాయలను నేరుగా వారి ఖాతాలలో సీఎం తూర్పుగోదావరి జిల్లా, నిడదవోలు నుండి బటన్ నొక్కి జమ చేశారన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆనం అరుణమ్మ, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా అధ్యక్షునిగా

# బాధ్యతలు చేపట్టిన వంశీధర్



బీజేపీ జిల్లా అధ్యక్షునిగా ఇటీవల నియమితులైన శీపా వంశీధర్‌రెడ్డి ఈనెల 19న నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. తనపై నమ్మకంతో అధ్యక్షునిగా నియమించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి, రాష్ట్ర నాయకులకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు.పి.సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు వేమిరెడ్డి రూ. 4 లక్షల ఆర్థిక సాయం



రాజ్యసభ సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు జర్నలిస్టులకు ఇటీవల నాలుగు లక్షల రూపాయలు సాయం చేశారు. నెల్లూరులో సాక్షి పత్రికలో జర్నలిస్టులుగా ఉన్న హజరత్‌కు రెండు లక్షలు, సాక్షిలో ఉన్న మరో జర్నలిస్ట్ సుబ్రహ్మణ్యంకు మెదడు సంబంధిత శస్త్ర చికిత్సకు 2 లక్షల రూపాయలు ఆర్థికసాయం చేసి ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, సాక్షి బ్యూరో చీఫ్ మస్తాన్‌రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, ఏపీయుడబ్ల్యుజె రాష్ట్రనాయకులు ఏ జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# చెత్తబుట్టను చేతబట్టిన కమిషనర్



చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తివేయాలంటూ పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించే నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ ఇటీవల తనే స్వయంగా చెత్తబుట్ట చేతబట్టి చెత్తను పరిశుభ్రం చేస్తూ సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు స్వర్ణాల చెరువు వద్దవున్న బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ఉన్న చెత్తను తొలగించారు. నెల్లూరు నగరాన్ని చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్, స్వచ్ఛత లీగ్ బ్రాండ్ అంబాసిడర్ కొమ్మెర్ల తులసి, పారిశుద్ధ్యసిబ్బంది, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.



# డా. కిషోర్స్ రత్నం విద్యార్థుల ప్రతిభ

నెల్లూరుకు చెందిన డా.కిషోర్స్ రత్నం హైస్కూలు విద్యార్థులు జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో సత్తాచాటుతూ బంగారు, వెండి పతకాలు సాధించి పాఠశాల కీర్తిని ఇనుమడింపజేశారు. ఇటీవల చెన్నైలో జరిగిన 42వ భారతీయ అబాకస్ పోటీల్లో టీ సిరీస్‌లో బి.రోనీష్ బంగారు పతకాన్ని, రెండవ లెవల్‌లో జస్మిత బంగారు పతకాన్ని సాధించారు. సుభిక్షయాదవ్ వెండి పతకం కైవసం చేసుకోగా, మూడవ లెవల్‌లో ఎం.సాయిచైత్ర మరో వెండి పతకాన్ని అందుకుంది. ఈ సందర్భంగా విద్యాసంస్థ డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు విద్యార్థులను అభినందించారు. రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామమూర్తి నాయుడు విజేతలైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల పాల్గొన్నారు.

## కరాటేలో ప్రతిభ చాటిన..

# 'స్మాలర్ స్కాలర్స్' చిన్నారి

○ జాతీయస్థాయిలో ద్వితీయస్థానం సాధించిన వేదఅక్షయ



కెనీ షిటో రియు వారు నిర్వహించిన జాతీయ కరాటో చాంపియన్‌షిప్-2023 పోటీల్లో నెల్లూరు లోని స్మాలర్‌స్కాలర్స్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న చిన్నారి వేద అక్షయ తన ప్రతిభను చాటుకుంటూ ద్వితీయ స్థానం సాధించింది. నగరంలోని రంగనాయకులపేటలో ఈనెల 17న ఈ పోటీలు జరిగాయి. 8 రాష్ట్రాల నుంచి సుమారు 600మంది క్రీడాకారులు వివిధ విభా గాల్లో ఈ పోటీలో పాల్గొన్నారు. 8 నుంచి 12 ఏళ్ళ లోపు బాలబాలికల (జూనియర్స్) కేటగిరిలో వేదఅక్షయకు రజత పతకం, ప్రశంసాపత్రం లభించడం విశేషం. ఈ సందర్భంగా స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ పద్మజారెడ్డి పాల్గొని ఆ చిన్నారిని అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో తమ విద్యార్థిని ద్వితీయస్థాయిలో రాణించడం గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 'తంగిరాల మహాభారతం' 73వ భాగం




దుర్యోధనుడు శకునితో పాటు తండ్రి ధృతరాష్ట్రుణ్ణి కలుస్తాడు. దుర్యోధనుడు ఎంతో చిక్కి శల్యమయ్యాడని శకుని, ధృతరాష్ట్రుడికి చెప్పగా, కంగారుపడి కొడుకు శరీరాన్ని తడిమి చూసి నీకిప్పుడు వచ్చిన కష్టమేమిటి నాయనా అని అనునయంగా అడుగుతాడు. మయసభలో తనకు జరిగిన అవమానాన్ని, తన భంగపాటుని చూసి ద్రౌపది నవ్విందని, ఆ పరాభవం సహించలేకపోతున్నానని, ధర్మరాజు తన సోదరుల పరాక్రమశక్తితో ఇంద్రునితో సమానమైన ఐశ్వర్యాన్ని సంపాదించాడని, రాజసూయ యాగాన్ని అత్యంత వైభవంగా జరిపించాడని, దానికి కావాల్సిన ధన, కనక, రత్న, వస్తు, వాహనాలను దేశదేశాల రాజాధిరాజులు సమర్పించి ధర్మరాజుకు విధేయులయ్యారని, ఇవన్నీ చూసి తట్టుకోలేకపోతున్నానని, ఇతరుల ప్రభావం చూసి జీవచ్ఛవంలాగా బ్రతకగలనా అని చెపుతాడు. శకుని జూదంలో ధర్మరాజును ఓడించి పాండవుల ఐశ్వర్యాన్ని నీకు సమర్పిస్తానని దుర్యోధనుడికి చెప్పినపుడు, దానికి అంగీకరించమని దుర్యోధనుడు తండ్రిని ప్రాధేయపడతాడు. విదురునితో ఒక మారు మాట్లాడి చెపుతానని, కొంతమంది శిల్పులను పిలిచి ఒక అపూర్వ మందిరాన్ని నిర్మించమని ఆజ్ఞాపిస్తాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.




# 'ఓజోన్'పట్ల విద్యార్థులకు అవగాహన

అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఇటీవల నెల్లూరులోని కొండాయపాలెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ఓజోన్ పొర ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణ గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం.భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సూర్యుని నుంచి వచ్చే హానికరమైన అతినీలలోహిత కిరణాల ప్రభావం నుంచి ఓజోన్ పొర భూమండలాన్ని రక్షిస్తోందని ఆయన చెప్పారు. విద్యార్థులకు చిత్రలేఖనంలో పోటీలుపెట్టి విజేతలకు బహుమతులిచ్చారు.

## ఎన్.వి.రమణయ్య సతీమణి

# నాదెళ్ల అనసూయమ్మ కన్నుమూత



ఎన్.వి.రమణయ్యగా, ఎస్వీఆర్ పేపర్ ఏజెన్సీ అధినేతగా, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్‌గా పాత తరం నెల్లూరీయులకు సుపరిచితులైన నాదెళ్ల రమణయ్య సతీమణి అనసూయమ్మ తమ 79వ యేట సెప్టెంబర్ 17వ తేదీ ఆదివారం సాయంత్రం 4గంటలకి కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆమె స్వల్ప అస్వస్థతతో చికిత్స తీసుకుంటు న్నారు. రమణయ్య – అనసూయమ్మ దంపతులకి ముగ్గురు కుమారులు. కృష్ణ ప్రసాద్, సురేష్, మురళి, ఇద్దరు కుమార్తెలు స్వర్ణలత, కళాజ్యోతి ఉన్నారు. నెల్లూరులో ఎస్వీఆర్ డిజిటల్ ప్లాజా సంస్థను సుదీర్ఘ కాలంగా నిర్వహిస్తూ శాంసంగ్ టీవీలు, గృహోపకరణాల డిస్ట్రిబ్యూటర్లుగా పేరు పొందిన అనసూయమ్మ కుమారులు సురేష్, మురళిలు కూడా ఈ తరం వారికి సుపరిచితులు. అనసూయమ్మ ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ ... నాదెళ్ల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# కందుకూరు అంకమ్మ తల్లి సేవలో.. వేమిరెడ్డి

## ○ ఆలయానికి రూ. 50 లక్షలు విరాళమిచ్చిన విపిఆర్

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు, రాజ్య సభ సభ్యులు, సేవాభూషణ్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ఇటీవల కందుకూరులోని గ్రామదేవత అంకమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయానికి 50 లక్షల రూపాయల భూరి విరాళాన్ని అందజేసి ఆయన తన ధార్మికసేవా తత్వాన్ని, దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆయనతో పాటు నగర డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. తొలుత, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, ఆలయ అర్చకులు సాదరంగా ఆహ్వానించారు. వేదమంత్రోచ్చారణల మధ్య అంకమ్మ తల్లి గుడిలో ప్రత్యేక పూజల అనంతరం, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. అంకమ్మ ఆలయం ప్రాధాన్యతను, కందుకూరు నియోజకవర్గంలో తాము చేస్తున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మహీధర్‌రెరెడ్డి విపిఆర్‌కు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. కందుకూరులో అంకమ్మ తల్లిని దర్శించుకోవడం తనకెంతో ఆనందం కలిగిస్తోందని, ఆలయంలో ఉన్న శిల్పాలు అద్భుతంగా ఉన్నాయని, వాటిని అంత అద్వితీయంగా తీర్చిదిద్దిన శిల్పులు మన రాష్ట్రంలో ఉండటం నిజంగా గొప్ప విషయమని అంటూ, ఆలయ పునర్నిర్మాణంలో పాలుపంచుకున్న శిల్పులకు తప్పకుండా టీటీడీ ఆధ్వర్యంలో పనిచేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఇంత గొప్పగా తీర్చిదిద్దిన ఆలయాన్ని ఇటీవల కాలంలో తాను ఎక్కడా చూడలేదన్నారు. ఆలయ పునర్నిర్మాణం కోసం ఎమ్మెల్యే, కమిటీ సభ్యులు ఎంత కష్టపడ్డారో ఆలయాన్ని చూస్తేనే అర్థంఅవుతుందని చెప్పారు. ఎందరో దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. ఈ నియోజకవర్గంలో రామాయపట్నం పోర్టును త్వరలోనే ప్రారంభించనున్నారని, కేవలం రెండేళ్లలోనే ఒక బెర్త్ పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం కావడం ఎమ్మెల్యే పనితీరుకు నిదర్శనమని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని, ప్రజలు తనను ఆదరించి గెలిపించాలని విపిఆర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. మంచి మనసు, సేవా దృక్పథంతో పాటు ప్రజాసేవకే జీవితం అంకితం



చేసిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, నెల్లూరు ఎంపీగా పోటీ చేస్తున్న వేమిరెడ్డిని కందుకూరు ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు.

## వీపీఆర్‌ని కలిసిన నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు





వైకాపా నెల్లూరు జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఇటీవల నెల్లూరులోని ఆయన నివాసంలో అల్లూరు, బోగోలు మండలాల నాయకులు కలసి సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ స్థితిగతులు, నాయకుల సమస్యలను వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. సమస్యలకు పరిష్కారం చూపుతామని, నాయకులందరూ సమష్టిగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలిచే విధంగా కష్ట పడాలని దిశానిర్దేశం చేశారు. పలు పంచాయతీల సర్పంచులు గ్రామాల్లో తాగునీటి సమస్యను ప్రస్తావించగా... వాటిపై కూడా దృష్టి సారిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

అదేవిధంగా ఏఐపీఈయూ ఆల్ ఇండియన్ పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్(ఏఐపీఈయూ) నాయకులు విపిఆర్‌ను కలసి, ఇటీవల యూనియన్ తరఫున నెల్లూరులో నిర్వహించిన ద్వైవార్షిక మహాసభలు విజయవంత మయ్యాయని అంటూ, అందుకు సహకరించిన ఎంపీకి ధన్యవా దాలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డివిజన్ ఏఐపీఈయూ గ్రూప్–సీ అధ్యక్షులు సీహెచ్ హరి, నెల్లూరు డివిజన్ ఏఐపీఈయూ పోస్టుమెన్ మరియు ఎంటీఎస్ యూనియన్ ప్రెసిడెంట్ బి.పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైసీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులు ఎం.నారాయణ బాబు ఆధ్వర్యంలో జిల్లా డ్యాన్స్ మాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఇటీవల మర్యాదపూర్వకంగా ఎంపీ వేమిరెడ్డిని కలిశారు. జిల్లా నూతన కమిటీ ఏర్పడిన నేపథ్యంలో కమిటీ సభ్యులు ఎంపీని నెల్లూరులోని ఆయన నివాసంలో కలసి శాలువాతో సత్కరించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్‌కే జహీర్, సెక్రటరీ కె.జనార్ధన్, వైస్ ప్రెసిడెంట్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో సిఐఐ బృందం

### నూతన సాంకేతిక నైపుణ్యాలపై అధ్యయనం



ఆంధ్రప్రదేశ్‌కి చెందిన 25 మంది కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సభ్యుల బృందం ఇటీవల రెండు రోజుల పాటు శ్రీసిటీని సందర్శించి, అక్కడ పలు పరిశ్రమలలోని మెరుగైన సాంకేతిక నైపుణ్యాలను అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ వారికి సాదర స్వాగతం పలికారు. సీఐఐ తిరుపతి జోన్ వైస్ ఛైర్మెన్ పుష్పిత్ గార్గ్, జోన్ హెడ్ పి.చందన్ పట్నాయక్ సారథ్యంలో ఈ బృందం శ్రీసిటీకి వచ్చింది. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి శ్రీసిటీ విశిష్టతను వివరిస్తూ, దేశంలోనే మెగా ఇండస్ట్రియల్ పార్కుల్లో ఒకటిగా శ్రీసిటీ అవతరించిందన్నారు. ఈ సందర్భంగా శ్రీసిటీలోని కొన్ని ప్రముఖ పరిశ్రమల ఉత్తమ తయారీ పద్ధతులను, సాంకేతిక నైపుణ్యాలను ఆ బృందం అధ్యయనం చేసింది. థెర్మాక్స్, దనైలీ, కాల్గేట్ పామోలివ్, కెల్లాగ్, బ్లూస్టార్ తదితర పరిశ్రమలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చర్చా కార్యక్రమాల్లో బృంద సభ్యులు పాల్గొని సంబంధిత కంపెనీల సాంకేతిక నైపుణ్యాలు, తయారీ విధానాలను తెలుసుకున్నారు.






## శ్రద్ధాంజలి



ప్రేమానురాగాలను పంచిన అమృతమూర్తి

**శారదమ్మ**



స్నేహానుబంధాలను పెంచిన ఆత్మీయదీప్తి

**శీనయ్య**

ఆ ఇద్దరినీ కోల్పోయి శోకతప్త హృదయాలతో ఉన్న "పాలిచర్ల" కుటుంబసభ్యులకు మనోస్థైర్యాన్ని ప్రసాదించాలని దైవాన్ని ప్రార్థిస్తూ...

అశ్రునయనాలతో...

**చిట్టమూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి**

నిర్మాత, 'గీతాంజలి'

మాజీ అధ్యక్షులు, జిల్లా యూత్ కాంగ్రెస్, నెల్లూరు.

## మంచితనానికి మారుపేరు.. 'కారుమంచి'

నెల్లూరులోని శ్రీ అన్నదేవుల గోవిందురెడ్డి సరస్వతీ సమాజానికి, వృద్ధుల సంఘాలకు, వినియోగదారుల సలహామండలికి, విశ్రాంత ఉద్యోగులకు, ముఖ్యంగా ఎంతోమంది పెన్షన్‌దారులకు అపారమైన సేవలందించి, ఇటీవలే దివంగతులైన కారుమంచి సీతారామాంజనేయశాస్త్రి సేవకు మరోపేరని, మంచితనానికి మారుపేరని, వారి సేవాభావం ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఈనెల 17న స్థానిక మూలాపేటలోని సరస్వతీసమాజంలో సీతారామాంజనేయశాస్త్రి సంతాపసభ జరిగింది. జీవితంలో తానెన్ని కష్టాలనుభవించినా, ప్రజలకు తనవంతు సేవచేయాలనే లక్ష్యంతో కారుమంచి జీవనం సాగించారని, పరులకు ఉపకారం చేయడమనే గొప్పగుణం ఆయనదని అంటూ, పలు సంఘాల నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమం సరస్వతీసమాజం సారధ్యంలో జరిగింది.

## యువతకు వక్తృత్వ పోటీలు

భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం-నెల్లూరు వారి ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీలలో నందనం రమ్య ప్రథమ స్థానంలో నిలిచింది. మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతిలను పురస్కరించుకుని అక్టోబర్ 2న పార్లమెంట్ భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో 25 మంది యువతకు ఉపన్యాసం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని జిల్లా యువజన అధికారి నెల్లూరు ఏ.మహేంద్రరెడ్డి చెప్పారు. రమ్యను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## రూరల్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి

### రావు శ్రీనివాసరావు



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని కార్పొరేషన్ పరిధిలో 26 డివిజన్లు, నెల్లూరు రూరల్ మండలంలోని 18 పంచాయతీల్లో శరవేగంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ, అభివృద్ధి అంటే ఇలా ఉండాలి అనే విధంగా నిధులు సమకూరుస్తూ, ఎప్పటికప్పుడు నియోజకవర్గంలో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్నీ నెల్లూరు ఎంపీ, రూరల్ వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తుండడంతో అభివృద్ధి పనులు ఊపందుకుంటున్నాయి. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 20వ డివిజన్‌లోని అన్ని సచివాలయాల పరిధిలో కోటి 20 లక్షల రూపాయల నిధులతో జరుగుతున్న పనులను 20వ డివిజన్ వైకాపా ఇన్‌ఛార్జ్ రావు శ్రీనివాసరావు(ఆర్ఎస్ఆర్) పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాల అంటే అభివృద్ధికి మారుపేరని, నియోజకవర్గంలో అనేకరకాల అభివృద్ధి పనులకు ఆదాల శ్రీకారం చుట్టడం సంతోషకరమని ఆర్ఎస్ఆర్ కొనియాడారు.

## బీజేపీ ఆధ్వర్యంలో.. విశ్వకర్మ జయంతి వేడుకలు

### మోడీ పుట్టినరోజున అన్నదానం

భగవాన్ విశ్వకర్మ జయంతిని నెల్లూరులోని బీజేపీ నాయకులు ఈనెల 17న ఘనంగా నిర్వహించారు. స్థానిక కొండాయపాళెం గేటు కూడలిలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు ప్రారంభించారు. ప్రధాని మోడీ దేశవ్యాప్తంగా 18 రకాల చేతివృత్తుదారులకు ప్రయోజనం కలిగే విధంగా 'ప్రధాని విశ్వకర్మ యోజన' పథకాన్ని ప్రవేశపెట్టడం హర్షదాయకమని కొనియాడారు. దేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకు ప్రధాని కృషి చేస్తున్నారని, భారతదేశ రక్షణ-అభివృద్ధి ధ్యేయంగా అనేక కార్యక్రమాలు చేపట్టి అమలుచేస్తున్నారని నాయకులు కొనియాడారు. అనంతరం, ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాకసిరి ఫణిరాజు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. అదేవిధంగా, ప్రధాని మోడీ 73వ పుట్టినరోజును పురస్కరించుకుని నాయకులు భారీ కేకు కట్‌చేసి అందరికీ పంచారు. నగరంలోని కుక్కలగుంట ప్రాంతంలో పేదలకు అన్నదానం చేశారు. తొలుత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి పాల్గొని కేకు కట్‌చేసి అందరికీ పంచారు. బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్, జిల్లా కార్యదర్శులు యరబోలు రాజేష్, బి.శ్రీను, గడ్డం విజయకుమార్, లీగల్‌సెల్ కన్వీనర్ దాసరి రాజేంద్రప్రసాద్, ఎస్సీమోర్చా అధ్యక్షుడు ప్రసాద్, మారం కృష్ణ, విజయలక్ష్మి, తేళ్లపల్లి రాఘవయ్య, చిలకా ప్రవీణ్ పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## నింగినంటిన నిరసనల హోరు



చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా మద్దతు తెలుపుతున్నారని, సీఎం జగన్ దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే భ్రష్టుపట్టారని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 4వ రోజు రిలే నిరాహారదీక్షలను మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలు కలిశాయని, దీనిపై వైకాపా నేతలు రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. గూడూరు పట్టణంలో చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా పాశం సునీల్‌కుమార్ కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో టెంకాయలు కొట్టి ప్రత్యేకపూజలు చేశారు. నాయకులు శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, కిషోర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 'కాళిదాస కళానికేతన్' వ్యవస్థాపకుడు, సీనియర్ జర్నలిస్టు గౌస్‌బాషా మృతి



గూడూరు పట్టణంలోని 'కాళిదాస కళానికేతన్' వ్యవస్థాపకులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్, సీనియర్ పాత్రికేయుడు ఎస్.కె.గౌస్‌బాషా(80) ఈ నెల 19వ తేదీ మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన స్థానిక నరసింగరావుపేటలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఈయన స్థాపించిన 'కాళిదాస కళానికేతన్' సంస్థ నుండే దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గాయకుడిగా తొలినాళ్లలో అరంగేట్రం చేశారు. కళానికేతన్ ద్వారా పలువురు కళాకారులు, గాయకులు చిత్రసీమకు పరిచయమయ్యారు. గౌస్‌బాషా మృతికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## వైసీపీ పట్టణ అధ్యక్షుడిగా బొమ్మిడి



వైసీపీ గూడూరు పట్టణ అధ్యక్షుడిగా బొమ్మిడి శ్రీనివాసులును రెండోసారి తిరిగి నియమించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బొమ్మిడి ఎమ్మెల్యే వరప్రసాద్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బొమ్మిడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు. యల్లసిరి గోపాల్‌రెడ్డి అనుచరుడిగా ఉన్నారు. గతంలోనే గూడూరు పట్టణ అధ్యక్షులుగా పట్టణంలో పార్టీ అభివృద్ధిని, పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో తనవంతు బాధ్యతలు నిర్వహించారు. రెండవసారి పట్టణ అధ్యక్షుడిగా నియమింపబడడానికి కారణమైన యల్లసిరి గోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళి, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిలకి బొమ్మిడి శ్రీనివాసులు ధన్యవాదాలు తెలిపారు.

## రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం



రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో నారాయణ దంత వైద్యశాల డాక్టర్ యు.నారాయణచే ఇటీవల సరస్వతి శిశు మందిరం స్కూల్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు దంతాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్ల గురించి వివరించారు. విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి సమస్యలు ఉన్నవారిని గుర్తించి వారికి తమ హాస్పిటల్‌లో ఉచితంగా చికిత్సలు నిర్వహిస్తామని నారాయణ చెప్పారు. ఈ సందర్భంగా బండి ధనంజయరెడ్డి దాతృత్వంతో విద్యార్థులకు టూత్ బ్రష్, టూత్‌పేస్ట్, బిస్కెట్లు, పెన్నులు అందజేశారు. క్లబ్ అధ్యక్షులు సనత్‌కుమార్‌రెడ్డి, సెక్రటరీ శివప్రసాద్, శిశు మందిరం కమిటీ అధ్యక్షులు మురళిరెడ్డి, రామ్మోహన్, హరినాథ్‌రెడ్డి, బలరాంరెడ్డి పాల్గొన్నారు.



## మడమనూరులో 4 లక్షలతో వినాయక మండపం

మనుబోలు మండలంలోని మడమనూరు గ్రామంలో ఈ నెల 17వ తేదీ శ్రీ వరసిద్ధి వినాయక మండపాన్ని (రచ్చబండ) ఘనంగా ప్రారంభించారు. శ్రీ సేవానాథం ట్రస్టు వ్యవస్థాపకులు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి దాతృత్వంతో 4 లక్షలతో నిర్మించిన మండపాన్ని ట్రస్ట్ ఫౌండర్ మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి సమక్షంలో మనుబోలు సొసైటీ అధ్యక్షులు మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గూడూరు వెంకటరమణ హోటల్ మేనేజ్‌మెంట్, సభ్యులు రాంప్రసాద్, సేవా ట్రస్టు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



గూడూరు న్యూ బాలాజీనగర్‌లో లయన్స్ క్లబ్ మరియు న్యూ బాలాజీనగర్ యూత్ ఆధ్వర్యంలో ఇటీవల రక్తదాన శిబిరం జరిగింది. లయన్స్ క్లబ్ సభ్యులు, న్యూ బాలాజీనగర్ యూత్ మరియు నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థినివిద్యార్థులు పాల్గొని దాదాపు 50యూనిట్ల రక్తాన్ని నోవా బ్లడ్ బ్యాంక్ వారికి ఇవ్వడం జరిగింది. లయన్స్ డిస్ట్రిక్ట్ ఛైర్మెన్ షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతి రెండు సెకండ్లకు ఒకరికి రక్తం అవసరం వస్తుందని, చాలామంది చిన్నపిల్లలు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారని, వారికి ప్రతి 15 రోజులకు ఒకసారి రక్త మార్పిడి అవసరమని, యువత ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కండంటూ యువతకు పిలుపునిచ్చారు. నోవా బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ మోపూరు భాస్కర్ నాయుడు, డాక్టర్ సుగుణమ్మ, అధ్యక్షుడు రవిచంద్ర, కార్యదర్శి కే.శివయ్య, జిల్లా ఛైర్మెన్ బీ.శీనయ్య, ట్రెజరర్ పి.వీరేంద్రనాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వాతి పాల్గొన్నారు.



# ఎన్‌బికెఆర్‌లో ఇంజనీర్స్ డే

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల ఇంజనీర్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి పాల్గొని, భారతదేశం గర్వించ దగ్గ ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను విద్యార్థులకు గుర్తుచేశారు. ఇంజనీరింగ్‌లో అసమాన ప్రతిభా పాటవాలతో ఆ మహనీయుడు నిర్మించిన పలు ఆనకట్టల నిర్మాణాలు చరిత్రాత్మకమన్నారు. 1908లో మూసీనదికి వరదలు వచ్చినప్పుడు, వాటివల్ల ప్రజలకు రక్షణ కల్పిస్తూ అనేక వంతెనలు నిర్మించారని, ఇంజనీరింగ్ రంగంలో ఆయనో ఆణిముత్యమని కొనియాడారు. విద్యార్థులు అలాంటి ప్రతిభాశాలుర జీవితాలను ఆదర్శంగా తీసుకుని, స్ఫూర్తిదాయకమైన వారి అడుగుజాడల్లో పయనించాలని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంకేతిక క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. డి.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# మైపాడు బీచ్‌కి.. త్వరలో కొత్త హంగులు

## ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న పర్యాటకశాఖ



జిల్లాలోని ఆహ్లాదకరమైన సాగరతీరం..మైపాడు బీచ్‌కు మంచిరోజులు రానున్నాయి. ఎంతోకాలంగా సముద్రతీరానికి వచ్చే పర్యాటకుల ఆకాంక్షలు తీరనున్నాయి. కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట మండలంలో ఉన్న ఈ బీచ్‌ని పర్యాటకపరంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. రాష్ట్ర పర్యాటకశాఖ అధికారుల నేతృత్వంలో కృషి ప్రారంభమైంది. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, స్థానిక వైకాపా నాయకుడు దువ్వూరు కల్యాణ్‌రెడ్డిల చొరవతో అటు మత్స్యకారులకు, ఇటు పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకునేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఈనెల 16న పర్యాటక శాఖ తిరుపతి రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్ సారథ్యంలో, మత్స్యశాఖ-రెవిన్యూశాఖల అధికారులు మైపాడు బీచ్‌ను సందర్శించారు. ఎక్కడెక్కడ ఎలాంటి అభివృద్ధికి వీలుంటుందో అంచనాలు వేశారు. దేశంలోనే అత్యంత అనువైన బీచ్‌లలో మైపాడు ఒకటిగా, అంతర్జాతీయస్థాయి బ్లూఫాగ్ హోదా కూడా సాధించిందని, ఇకపై అన్ని సౌకర్యాలతో, పర్యాటకులకు వినోదాత్మకంగా.. ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లుచేస్తామని రమణప్రసాద్ ఈ సందర్భంగా చెప్పారు. అంతేకాదు, పర్యాటకులను ఆకట్టుకునేలా బీచ్ వద్ద సర్వాంగ సుందరంగా ముఖద్వారం నిర్మించడంతో పాటు, పర్యాటకులకు బాగా ఇష్టపడే బోట్‌షికార్, సురక్షితమైన ఈతకొలను, స్కేటింగ్, చిల్డ్రన్ పార్కు, జిమ్, స్నానపుగదులు వగైరాలన్నీ ఏర్పాటుచేస్తామన్నారు. మత్స్యకారులకు మార్కెట్ సౌకర్యాలను కల్పిస్తూ, సముద్రంలోని మత్స్యసంపద ప్రదర్శనకు షాప్‌లు ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదిస్తున్నామని, త్వరలో ప్రభుత్వ అనుమతితో ఈ బీచ్ పర్యాటక శోభతో అలరారేవిధంగా రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్కిటెక్ట్ సుజిత్ కుమార్, జిల్లా పర్యాటకశాఖ అధికారి సాయికృష్ణ, పర్యాటకశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వంశీ, ఎఫ్‌డిఓ సురేష్, ఇందుకూరుపేట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జీవన్, సర్వేయర్ హరనాథ్, విఆర్‌ఓ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# అప్పులు తప్ప.. అభివృద్ధి లేని ఆంధ్ర

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రం అప్పుల పాలైపోతున్నదే తప్ప అభివృద్ధి కనిపించడం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఈనెల 16న నెల్లూరులోని ఏఐఎస్ఎఫ్ మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు వైఎస్ జగన్ హామీలను నమ్మి ప్రజలు ఆయనకు ఒక్క అవకాశం ఇస్తే, రాష్ట్రాన్ని అప్పులకుప్పగా తయారుచేసి పెట్టారని, వేలకోట్ల అప్పులు చేస్తున్నారే తప్ప రాష్ట్రంలో కొత్త ప్రాజెక్టును ఒక్కటీ కట్టింది లేదన్నారు. పైగా విద్యుత్‌చార్జీలు ఏడుసార్లు పెంచి ప్రజలను పన్నుల బాదుడుతో నానా బాధలు పెడుతున్నారని, ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గద్దె దిగేవరకు ప్రజలు పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# సమకాలీన సమస్యల కవిత్వీకరణే.. 'నా కలం స్పందన'

నెల్లూరుకు చెందిన డాక్టర్ నీలం స్వాతి ఎన్నో ఆలోచనాత్మకమైన కవితలతో పాఠకులను అలరిస్తున్నారు. ఆమె రెండవ కవితా సంకలనం 'నా కలం స్పందన'. అందులో ఆమె తన కవిత్వాన్ని గురించి చెపుతూ, 'కలల కావ్యం కదా కవిత్వం / అలల రాగం కాదా కవిత్వం / చనుబాల తియ్యదనం కాదా కవిత్వం / కన్నీటి గేయం కాదా కవిత్వం / అంటూ ఏది కాదు కవిత్వం?... అంటూ ప్రశ్నిస్తుంది. కుక్కపిల్ల, సబ్బు బిళ్ల ఏదీ కాదు కవితకనర్హం అన్న శ్రీశ్రీ మాటలు గుర్తుకొస్తాయి. కవిత్వానికి అనర్హమైనది ఏదీ లేదని ఆమె భావం. 'నా కలం స్పందన'లో సందర్భానుసారం ఆమె రాసిన కవితలు కొన్నయితే, నేటి సమాజ తీరుతెన్నులపై రాసిన కవితలు కొన్ని. సిరివెన్నెల సీతారామశాస్త్రిని గురించి చెపుతూ ఒక చోట. 'కథ కవితలా సాగితే / కదిలిస్తుందని... / కవి వర్ణిస్తే కథనం / కనుల మెరిసి కన్నీరు / పెట్టిస్తుందని... అంటుంది. కవిత్వాన్ని గురించి సరళంగా ఎంత చక్కగా చెప్పిందో అన్పిస్తుంది. 'కర్రేగా అని చులకనగా చూడకండి / దేని విలువ దానికి ఉంటుంది... / అంటూ చేతికర్ర ఉపయోగాలను ఏకరువు పెడుతుంది. 'అయిన వార్ని నోట మాట పడనీక / వృద్ధాప్యంలో స్వాభిమానాన్ని కాపాడేది / అంటుంది. చేతి కర్రలో కూడా గొప్పతనాన్ని గుర్తించి కవనమల్లడం ప్రత్యేక కవితాగుణం. అందరూ 'తల్లి'ని కీర్తిస్తారు. కానీ 'తండ్రి'లోని గొప్పదనాన్ని గుర్తించి కీర్తించారు స్వాతి తన 'బైరాగి' కవితలో – 'ప్రతి ఇంటా తండ్రిని సృష్టించాడు బ్రహ్మ / విషాన్ని కంఠంలో దాచిన ఆ నీలకంఠుని వలె... / శిలువ భారాన్ని మోసిన యేసువలె... / అంటుంది. 'బాధ్యతలను తన భుజాలపై మోస్తూ / ఎదారిదారుల్లో ఒంటరై / ప్రయాణాన్ని సాగిస్తూ / కష్టాల కొలిమిలో తాను కాలిపోతూ / బంగారు భవితను తన వారసత్వానికి అందిస్తాడు / అంటూ తండ్రి ఔన్నత్యాన్ని స్పష్టీకరిస్తుంది.

మాతృభాష గురించి చెపుతూ, "చినుకమ్మ గిలిగింతల భాష / చేనమ్మ తుళ్లింతల భాష / వెన్నెలమ్మ చల్లని భాష / అమ్మ చేతి గోరుముద్దల భాష / అంటూ మనోహరంగా కవిత్వీకరిస్తుంది. అందమైన బాల్యాన్ని గురించి చెప్తూ "ఆ బాలకృష్ణులకు.. / ఆట పాటలు తప్ప మరో ధ్యాస లేదు / సరదాలు, సంతోషాలు తప్ప / కాస్తంత దిగులుగూడ లేదు...। వారిదైన ప్రపంచంలో వారికి ఏ పరిధులు ఉండవు" అంటుంది. నిజమే పిల్లలది అందమైన ప్రపంచం. కల్లాకపటమెరుగని లోకం.




నా కలం స్పందన
రచయిత:
డా॥ స్వాతి నీలం
పేజీలు: 96 వెల. అమూల్యం/-
ప్రతులకు: అరుణానంద్ ప్రచురణలు
31-13-10, మాచవరం,
విజయవాడ - 520 004.
సెల్: 94928 11322.

కవి కూడా వైద్యుడు లాంటి వాడేనని తన 'కవి వైద్యం' కవిత్వంలో ఇలాగ చెపుతుంది. "మరిచిన మానవత్వం / మనుషులలో వారి / మనసులలో పెరిగే వరకు / చెడు అన్న కలుపులను పీకేవరకు / మంచి అన్న బీజాలను నాటేవరకు / కవితా సేద్యం / కవి వైద్యం చేయక తప్పదు" అంటుంది. వైద్యురాలే కవయిత్రి అవడం ఇలాంటి అద్భుతమైన వాక్యాలు రావడానికి కారణంగా భావించవచ్చు. ఈ డాక్టరమ్మ మందులతో రోగులకు, సమాజ రుగ్మతలకు కవిత్వంతో వైద్యం చేయ సంకల్పించిందని రూఢిగా చెప్పవచ్చు. కవయిత్రిలో ఆశావాదం స్పష్టంగా కన్పిస్తుంది. మాటల జోరులో / మనుషుల తీరులో / ఆలోచనలో / ఆచరించే విధివిధానాలలో / మార్పులు, చేర్పులు వచ్చిన మాట నిజం/ అంటూ ప్రస్తుత పరిస్థితులను కళ్లకు కడుతూ... అంతటితో ఆగక 'బంధాలు, బలహీనతలు / అనురాగాలు, ఆప్యాయతలు / సజీవంగా ఇంకా మనుషులలో / ఎక్కడో ఒకచోట దాగేవున్నాయి అంటూ ఇంకా మానవత్వం పూర్తిగా చచ్చిపోలేదని భరోసా ఇస్తుంది.

ఈ విధంగా చెప్పుకుంటూపోతే 'స్వాతి' కవితలు సామాజిక స్పృహతోను, సందేశాత్మక బోధతోను నిండి వున్నాయని తెలుస్తుంది. 100 పేజీల ఈ పుస్తకంలో ప్రతి కవితా విలువైనదే! పఠన యోగ్యమైనదే! ఆలోచనలను రేకెత్తింపజేసేదే! చిన్నవయసులో పెద్ద సాహిత్యాభిలాష కలిగివుండటం, చక్కటి సృజన శీలత్వం కలిగివుండడం 'స్వాతి'లోని చెప్పుకోదగ్గ గుణం-ఆమె కలం నుండి మరిన్ని మంచి కవితలు భవిష్యత్తులో జాలువారాలని ఆశిస్తూ.. ఆశీర్వదిస్తూ...



డాక్టర్ గంగిశెట్టి శివకుమార్
సెల్: 9441895343

## టూకీగా...



### కొండబిట్రగుంటలో ప్రసన్నునికి ప్రత్యేకపూజలు

బోగోలు మండలం కొండబిట్రగుంటలో కొలువైవున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామికి అర్చకులు ఇటీవల ప్రత్యేక పూజలు చేసి, ఊంజల్‌సేవ, సహస్ర దీపాలంకరణ సేవలు వేడుకగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ఆలయ ఛైర్మెన్ శ్రీరాంమాల్యాద్రి, ఇఓ రాధాకృష్ణ పర్యవేక్షించారు.

### ముత్తుకూరులో హిందీ భాషా దినోత్సవం

హిందీ దివస్‌ను పురస్కరించుకుని ఇటీవల ముత్తుకూరులోని జడ్పీ హైస్కూల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మధుసూదన్ పాల్గొని విద్యార్థులకు హిందీ భాష ప్రాధాన్యతను వివరిస్తూ, జాతీయభాషగా పేరొందిన హిందీ పట్ల అవగాహన కలిగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చల్లా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పొదలకూరు విద్యార్థినుల క్రీడాప్రతిభ

పొదలకూరు డిఎన్ఆర్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు బి.పెంచల లోహిత, యు.ప్రహర్షిణి, పి.సమంత, ఐశ్వర్యలు హాకీలో క్రీడాప్రతిభతో రాణిస్తూ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగనున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో పీడీ పార్వతి, పీఇటి సునందలు వారిని అభినందించారు.

### ధర్మవరం యువత మానవీయత

రోడ్డుప్రమాదంలో గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్లు మరణిస్తే, మృతుని కుటుంబాన్ని ఆదుకునేందుకు ధర్మవరం యువకులు కొందరు నడుంబిగించి పెద్దల సహకారంతో 4.5 లక్షల రూపాయలను సేకరించి మృతుని పిల్లల పేరుతో పెద్దిరెడ్డిపల్లిలోని బ్యాంకులో డిపాజిట్‌చేసి తమ మానవీయతను చాటుకున్నారు. ఆ కుటుంబానికి బ్యాంకువారు ఇటీవల ఆ బాండ్లు అందజేశారు.

### కమ్మపాలెంలో రైతులకు శిక్షణ

కొడవలూరు మండలం కమ్మపాలెం రైతుభరోసా కేంద్రంలో రైతులకు ఇటీవల పంటల దిగుబడిపై శిక్షణ ఇచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారిణి శైలజ, కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త ఎస్ లోకేష్‌బాబు పాల్గొని ఈ సీజన్‌లో రైతులు ఎలాంటి వరి రకాలను పండిస్తే లాభదాయకమో చెప్పారు. వేరుశనగ అధిక దిగుబడికి టిసిజిఎస్ 1694 రకాన్ని సాగు చేసుకోవాలన్నారు.

### దండిగుంటలో పౌష్టిక మాసోత్సవాలు

విడవలూరు మండలం దండిగుంటలో ఇటీవల పౌష్టిక మాసోత్సవాల్లో భాగంగా ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్ రమణి పాల్గొని గర్భిణులు, బాలింతలు, తల్లులకు పోషక విలువలున్న ఆహారపదార్థాల ప్రాముఖ్యతను తెలియజెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు శిరీష, భారతి, వాణి, లక్ష్మి, చాందిని, ప్రసన్న, గ్రామ సర్పంచ్, ఎంపిటీసీలు పాల్గొన్నారు.

### వింజమూరు పోలేరమ్మ గుడిలో చోరీ

వింజమూరులోని నార్త్‌వస్సీకాలనీలో ఉన్న పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో ఈనెల 15వ తేది రాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్తులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్ఐ కోటిరెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు.

### కొండాపురంలో సమాచారహక్కు చట్టంపై అవగాహన

మండల కేంద్రమైన కొండాపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కలిగించారు. ప్రిన్సిపాల్ శ్రీహరి, అధ్యాపకులు, పాల్గొన్నారు.

### చెర్లోయడవల్లిలో ఆరోగ్య సురక్షపై సర్వే

ఆత్మకూరు మండలంలోని చెర్లోయడవల్లి గ్రామంలో ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఇంటింటి సర్వే చేపట్టారు. మండలపరిషత్ అధ్యక్షుడు కేతా వేణు గోపాల్‌రెడ్డి ఆ సర్వేను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ప్రజల ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడే ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# మహిళలే... మహా'రాణులు'

(మొదటి పేజీ తరువాయి)

మహిళా బిల్లుకు మేము వ్యతిరేకం కాదని చెబుతూనే కొన్ని పార్టీలు సన్నాయి నొక్కులు నొక్కుతుంటే.... మరికొన్ని పార్టీలు మాత్రం తమ కృషి ఫలితంగానే మహిళాబిల్లు గురించి ఎన్డీయే ప్రభుత్వం ఆలోచించిందని గొప్పగా చెప్పుకుంటున్నాయి. ఈ మాటలు, ఆ ప్రయత్నాలు పాతికేళ్లుగా సాగుతూనే ఉన్నాయనే విషయాన్ని మాత్రం చెప్పడానికి బహుశా వారి మనసు ఒప్పుకోకపోవచ్చు. 2014లో మేనిఫెస్టోలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు మోక్షం కల్పిస్తామన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం, గెలిచిన తర్వాత ఆ విషయాన్ని పట్టించుకోలేదు. ఆ తర్వాత 2019 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఈ విషయాన్ని భారతీయ జనతా పార్టీకి గుర్తు చేసే ప్రయత్నం చేస్తూ, తమ మద్దతు అందిస్తున్నామంటూ ఉత్తరాలు రాసింది. చివరకు మళ్ళీ ఎన్నికల సమయానికి ఈ బిల్లు కొత్త పార్లమెంట్‌కు రావటం ఆమోదింపబడటం కొసమెరుపు.

స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పుడు బిల్లులు ఆమోదం పొందటం మనకి సర్వసాధారణమే. తలుపులు వేసి మరీ ఆమోదింపజేసిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన విషయాన్ని మనం గమనించాం. అలాంటి ప్రజాస్వామ్య భారతదేశంలో అందరి మద్దతు ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లుకు 27 సంవత్సరాల సమయం ఎందుకు పట్టిందో తెలుసుకోవాలంటే ఒక్కసారి చరిత్రలోకి వెళ్ళాల్సిందే. మొదట మహిళా బిల్లును 1996లో దేవెగౌడ ప్రభుత్వం 81వ రాజ్యాంగ సవరణగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. అప్పట్లో గీతా ముఖర్జీ నాయకత్వంలోని కమిటీ ఏడు సూచనలు చేసింది. ఆ తర్వాత మరో నాలుగుమార్లు అంటే 1998, 1999, 2008, 2010లో బిల్లు పార్లమెంట్‌కు వచ్చింది గానీ చట్టంగా రూపుదాల్చలేదు. 1996లో చేసిన సూచనల్లో 5 సూచనలను 2008లో బిల్లులో చేర్చారు. ఈ సవరణ చట్టం అమలులోకి వచ్చిన 15 ఏళ్ళ తర్వాత మహిళలకు సీట్ల రిజర్వేషన్ ముగిసే ప్రతిపాదన కూడా ఇందులో ఉంది. మహిళలకు కల్పించే 33 శాతం రిజర్వేషన్‌లో నిబంధనల ప్రకారం వివిధ సామాజికవర్గాలకు ఉపరిజర్వేషన్ కల్పించాలన్న అంశాన్ని కూడా ఇందులో చేర్చారు. అందరి మద్దతు ఉన్నప్పటికీ బిల్లును రూపొందించిన తీరుతో ఏకీభవించటం లేదని కొన్ని పార్టీలు చెప్పగా, మరికొంత మంది ఇది 20 శాతం ఉంటే చాలని చెప్పుకొచ్చారు. మరికొన్ని సమయాల్లో బిల్లు ఆమోదం పొందకపోతే ప్రభుత్వం ప్రమాదంలో పడుతుందని భయాలు కూడా ఎదురయ్యాయి. 2014లో లోక్‌సభ రద్దయ్యాక మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా రద్దైంది. కానీ రాజ్యసభలో అలానే ఉంది. ఇప్పుడు లోక్‌సభ ఆమోదం పొందింది కాబట్టి, ఇక ప్రస్తుత మహిళా రాష్ట్రపతి సంతకంతో అది చట్టంగా మారుతుంది. 75ఏళ్ళ స్వాతంత్ర్య అమృతోత్సవాలు, నూతన పార్లమెంట్ పరంగా చూస్తే ఇదో చరిత్ర. ప్రధానమంత్రి చెబుతున్న రానున్న అమృత కాలపు అభివృద్ధిని మహిళామూర్తుల దిశానిర్దేశకత్వంతో ముందుకు సాగించవచ్చు.

అసలు మహిళా రిజర్వేషన్ అనే అంశం 1975లో ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 'సమానత్వం వైపు' అన్న పేరుతో నివేదికగా వచ్చింది. ఆ సమయంలో మహిళా రిజర్వేషన్ల మీద తొలిసారిగా చర్చ జరిగింది. మహిళలు స్వశక్తితో రాజకీయాల్లో ఎదగాలే గానీ, రిజర్వేషన్ ద్వారా కాదనే వాదనలు మొదలయ్యాయి. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నపుడు పంచాయితీలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి ప్రయత్నించగా, రాష్ట్ర అసెంబ్లీలు దాన్ని వ్యతిరేకించాయి. ఆ తరువాతి కాలంలో పి.వి. నరసింహా రావు ప్రధాని అయ్యాక, పంచాయితీలు, స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించారు. అంతకు ముందే ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేసిన విషయాన్ని కూడా మనం మరువకూడదు. కొన్ని పార్టీలు మాత్రం మహిళలకు ఇస్తున్న రిజర్వేషన్లు వెనుకబడిన కులాలకు ఇవ్వాలని వాదిస్తుండగా, కొందరు పెద్ద స్థాయి నాయకులే ఇది అగ్ర కులాల మహిళలకు మాత్రమే ఉపయోగపడే బిల్లు అని తేల్చేశారు. 1998లో అయితే ఏకంగా ఓ ఎంపీ వెల్‌లోకి దూసుకెళ్ళి... బిల్లు కాపీలను చించేశారు. ఆతర్వాత వాజ్‌పేయి ప్రభుత్వం అనేక పర్యాయాలు మహిళా బిల్లును ప్రవేశపెట్టి ఇబ్బందుల్లో పడింది కూడా.

అసలు మహిళా బిల్లు విషయంలో ఇంత యాగీ ఎందుకనే సందేహాలు రాక మానవు. ఇందులో ప్రధానంగా ఓ మేధావి వర్గం చెబుతున్న మాట మహిళలు ప్రత్యేక కులం కాదు, జాతి అనేది వారి వాదన. ఇంకొంత మంది మాత్రం ఆడవాళ్ళకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పిస్తే ప్రతిభ ఆధారంగా పోటీ చెయ్యలేకపోవచ్చని. రిజర్వేషన్ వారిలో పోరాట స్ఫూర్తిని అణగదొక్కుతుందన్నది కూడా ఒక వాదన. ఇవన్నీ అర్థం లేని, ఊకదంపుడు వాదనలని ఇట్టే అర్థమైపోతోంది. అన్నింటికీ మించి ఓ పెద్ద మేధావి వర్గం చెప్పే మాట... మహిళలకు పదవులు వచ్చినా, వారి భర్తలే అధికారం చెలాయిస్తారని. దీనికి గతంలో రాజ్యసభ చైర్మన్ గా ఉన్న 13వ ఉపరాష్ట్రపతి, మన నెల్లూరీయుడు ముప్పవరపు వెంకయ్యానాయుడు ఓ అద్భుతమైన సమాధానం చెప్పేవారు. "మహిళలు గెలిస్తే వాళ్ళ భర్తల చేతుల్లో అధికారం ఉంటుంది అంటున్నారు. సరే ఉండనివ్వండి. అలా కొద్దిరోజులు ఆగి చూడండి.. పతి గారి గతి ఏమౌతుందో" అంటూ చమత్కరించేవారు. వారు చమత్కారంగా చెప్పినా ఇది వాస్తవం. ఒక్కసారి అవకాశం ఇస్తే... వాళ్ళను వాళ్ళు నిరూపించుకోగలరు. వారికి సాటిలేదని చాటి చెప్పగలరు.

అంతిమంగా ఓ పెద్దాయన చెప్పినట్లు... ఓ పురుషుడికి లడ్డు ఇస్తే అక్కడే తిని వెళతాడు. కానీ ఓ మహిళకి లడ్డు ఇస్తే... కుటుంబ సభ్యుల కోసం దాచి తీసుకువెళుతుంది. మన భారతీయ సంస్కృతిలో తరతరాలు మహిళల రక్తంలో పేరుకుపోయిన త్యాగగుణం ఇది. ఆ గుణానికి ప్రతిఫలంగా వారికి అమ్మగా మారే అవకాశాన్ని భగవంతుడు ఇచ్చాడేమో అనిపిస్తుంది. ఓ సినిమాలో చెప్పినట్లు పాలిచ్చే తల్లులకు... పాలించటం ఓ లెక్కా. ఇంటిని చక్కదిద్దే అమ్మలకు... దేశానికి దిశానిర్దేశం చేయటం చాలా సులభం. ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే... 33 శాతం ఖచ్చితంగా మహిళామణులే ఉంటారు. సతీసహగమన నిరోధం తర్వాత.. దేశంలో మహిళల విషయంలో రానున్న అతిపెద్ద మార్పు బహుశా ఇదే అవుతుంది. అమృతమహోత్సవాలు ముగిసిన తర్వాత, తొలిసారి ఓ గిరిజన మహిళ రాష్ట్రపతి పీఠంమీద కూర్చున్న నేపథ్యంలో, నూతన పార్లమెంట్ భవనం సాక్షిగా ఆమోదంపొందిన వెళ్తున్న మహిళా బిల్లు... రానున్న అమృత కాలంలో... అమ్మల దిశానిర్దేశకత్వంలో అమృతమయం కావాలని, ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిద్దాం.

**'యత్ర నార్యస్తు పూజ్యంతే – రమంతే తత్ర దేవతాః'**

# 'జాబ్‌మేళా'తో 52 మందికి ఉద్యోగాలు

నెల్లూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 20న జరిగిన జాబ్‌మేళాతో 52 మందికి ఉద్యోగాలు లభించాయి. ఈ జాబ్‌మేళా కార్యక్రమంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో ఉద్యోగార్థులు పాల్గొన్నారు. ఇన్నోసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి 23 మంది, వీల్స్ ఇండియా కంపెనీకి 11 మంది, వరుణ్ మోటార్స్‌కు 18 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి అధికారి ఎం.వినయకుమార్ తెలియజేశారు.

# సొంతింట్లోకి.. డాక్టర్ గోపాలకృష్ణ

- సహచర డాక్టర్లే అతిథులు..రోగులే ఆహ్వానితులు
- నేత్ర రోగులకు కంటివెలుగు కానున్న..'అర్క' ఆసుపత్రి



సహచర డాక్టర్లే ముఖ్యఅతిథులుగా.. రోగులే ప్రత్యేక ఆహ్వానితులుగా డాక్టర్ గోపాలకృష్ణ సొంతింటిలాంటి కొత్త భవనంలో ఆసుపత్రిని ప్రారంభించారు. నెల్లూరులో వైద్యులున్నచోటుగా పేరొందిన పొగతోట రైల్వేట్రాక్ రోడ్డులో తన ఆత్మీయులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబసభ్యుల సమక్షంలో ఈనెల 17వ తేదీ ఆదివారం ఉదయం 'అర్క' నేత్ర వైద్యశాల పేరుతో ఆయన ప్రారంభించిన అధునాతన ఆసుపత్రి కనువిందుగా ఉంది. నేత్రరోగులకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో ఆధునిక వైద్యశాస్త్ర పరిజ్ఞానంతో, అత్యాధునిక పరికరాలతో, అత్యున్నత ప్రమాణాలతో ఈ ఆసుపత్రి నిర్మాణం జరిగింది. చీకటిని పారద్రోలి వెలుతురు కిరణాలతో అందరికీ వెలుగులు ప్రసాదించే 'అర్క'(సూర్యుడు) పేరుతో నిర్మించిన ఈ ఆసుపత్రి.. నేత్రరోగులకు కంటి వెలుగు కానుంది.

నెల్లూరులో డాక్టర్ గోపాలకృష్ణ అన్నా, ప్రముఖ నేత్రవైద్యశాల 'మోడరన్ ఐ ఆసుపత్రి' అన్నా తెలియనిదెవరికి?.. అందరికీ సుపరిచితమే. ఈ ఆసుపత్రిలో దాదాపు ఇరవైఏళ్ళుగా నేత్రరోగులకు విశిష్టమైన సేవలందించిన వైద్యులాయన. ఒక్క నెల్లూరులోనే కాదు, రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి కూడా ఇక్కడికి వచ్చి కంటి సమస్యలకు పరిష్కారం పొందుతున్న రోగులకు లెక్కే లేదు. ఇప్పుడు సొంతంగా ఆయన ఈ ఆసుపత్రిని ప్రారంభించారు. కంటి వైద్యానికి, అవసరమైన శస్త్రచికిత్సలకూ జిల్లాలో ఎక్కువగా డాక్టర్ ఓ.గోపాలకృష్ణ పేరే ప్రముఖంగా వినపడుతుంటుంది. డాక్టర్ గోపాలకృష్ణ రోగుల పట్ల అభిమానంతో ఉండడం, స్వతహాగా మృదుస్వభావి కావడం ఒక విశేషమైతే, మంచికి మారుపేరుగా నిలిచి నెల్లూరులో ప్రసిద్ధిగాంచిన దివంగత వాస్తు రామచంద్రరావుకు డాక్టర్ గోపాలకృష్ణ స్వయానా అల్లుడు కావడంతో రెండందాల ఆయనకు మంచిపేరు, గుర్తింపు లభించాయి.

సుప్రసిద్ధ కంటివైద్య నిపుణులు డాక్టర్ ఎస్‌సి సుబ్రహ్మణ్యం చేతులమీదుగా ఈ కొత్త కంటి ఆసుపత్రి ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఆసుపత్రిలోని పలు విభాగాలను ప్రముఖ వైద్యులు డాక్టర్ శివప్రతాప్‌రెడ్డి, డాక్టర్ టివై కృష్ణ, డాక్టర్ జెకె రెడ్డి, డాక్టర్ పి.నరసింహారావు, డాక్టర్ మంజులమ్మ, డాక్టర్ బి.కృష్ణమూర్తి, డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్లంతా డాక్టర్ గోపాలకృష్ణ నేత్రరోగులకు అందిస్తున్న అమూల్యమైన సేవలను, ఆయన శస్త్రచికిత్సా నైపుణ్యాన్ని కొనియాడుతూ నేత్రవైద్యానికి 'అర్క' వైద్యశాల మరింతగా ప్రసిద్ధిచెందాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రి సిబ్బందితో పాటు పలువురు నగర ప్రముఖులు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.









# ఆవుల రమణయ్య కన్నుమూత



నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాలలో సుదీర్ఘకాలం కాంపౌండర్‌గా, ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ ఎంతో మంది రోగులకు తనవంతు సేవలందించిన ఆవుల రమణయ్య(76) అనారోగ్యంతో కన్నుమూశారు. ఈనెల 20న ఆయన అంత్యక్రియలు జరిగాయి. కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో కమ్యూనిస్టుగా ఎదిగిన రమణయ్య మృతి ఆసుపత్రి వర్గాలకు ఆవేదన కలిగించింది. విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి బాలాజీనగర్‌లోని రమణయ్య నివాసానికి వెళ్ళి ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం నాయకులు చంద్ర రాజగోపాల్, మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు, సిఐటియు నాయకులు ఎం.మోహన్‌రావు, కె.అజయ్‌కుమార్, సతీష్, ప్రజావైద్యశాల డాక్టర్లు ఎం.వి.రమణయ్య, జి.రమేష్‌బాబు తదితరులు రమణయ్య సేవలను స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు.

# గణనాధునికి ఘనంగా వేడుకలు

వినాయక చవితి సందర్భంగా ఈనెల 18, 19 తేదీల్లో జిల్లావ్యాప్తంగా ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అనేకమంది భక్తులు మట్టి వినాయక ప్రతిమలను తెచ్చుకుని పూజలు చేశారు. నెల్లూరు నగరంలో వీధివీధినా వినాయక విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక మండపాలను విద్యుత్‌దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. జై జై గణేశా అంటూ యువత జేజేలు పలికారు. నగరంలోని మండపాలన్నీ భక్తులతో క్రిక్కిరిసిపోయాయి. ట్రంకు రోడ్డు, చిన్నబజార్, పెద్దబజార్, రంగనాయకులపేట, బాలాజీనగర్, ఏసీనగర్, స్టోన్‌హౌస్‌పేట, దర్గామిట్ట, బీవీనగర్, వెంకటేశ్వరపురం, వేదాయపాళెం తదితర అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో భక్తజన బృందాలు వినాయకునికి పెద్దఎత్తున వేడుకలు చేశారు. అనేక చోట్ల ఉట్టి మహోత్సవాలు కూడా కోలాహలంగా జరిగాయి. గాంధీబొమ్మ కూడలిలోని శివాజీ సెంటర్‌లో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో విక్రమసింహపురి గణేశ్ ఉత్సవ సమితి, శివాజీ మిత్రమండలి ఆధ్వర్యంలో పూజలు చేశారు. బీజేపీ నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయ రెడ్డి, ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, పిట్టి సత్యనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నగరంలోని అన్నిచోట్లా ఆయ ప్రాంతాల్లో ఉన్న స్థానిక నాయకులు, ప్రముఖులు, ప్రజలు ఉత్సాహంతో ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. నెల్లూరు చెరువుగట్టున వెలసివున్న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద గణేష్‌ఘాట్‌లోను, పెన్నానదిలోనూ



చిన్నచిన్న వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు భక్తజనులు తరలిరావడంతో ఆ ప్రాంతాలు సందడిగా మారాయి.

# 602 ఫోన్లు.. రికవరీ

వివిధ కారణాలతో పోగొట్టుకున్న, దాదాపు ఒకటిన్నర కోటి రూపాయలు విలువచేసే 602 మొబైల్ ఫోన్లలను జిల్లా పోలీసు యంత్రాంగం కనుగొని వాటిని సొంతదారులకు అందజేసింది. జిల్లా ఎస్పీ డా.కె. తిరుమలేశ్వరరెడ్డి ఈనెల 19న నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బాధితులకు ఆ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మొబైల్‌హంట్ యాప్‌తో ఆ ఫోన్లు ఎక్కడున్నాయో తెలుసుకోగలిగామని, ఆ విధానం సత్ఫలితాలను ఇస్తోందని చెప్పారు. ఇప్పటిదాకా నాలుగు విడతలుగా జిల్లాలో 3.10 కోట్ల రూపాయల విలువచేసే 1246 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి, బాధితులకు అందజేశామన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఎస్పీ డి.హిమవతి, ఆర్ఐ అంకమరావు, సైబర్‌క్రైమ్స్ ఇన్స్‌పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ 'సమస్య' నుంచే ఈ 'అవకాశం'!!



సంస్కరణలు... అభివృద్ధిలోనే రాజకీయాలు చూసే నారా చంద్రబాబు నాయుడు పుట్టుక రీత్యా రాజకీయవాది. ఇంగ్లీష్‌లో చెప్పాలి అంటే... ఏ 'బోర్న్ పొలిటిషియన్ త్రూ రిఫార్మ్స్ & డెవలప్మెంట్'. ఆయనలో అణువణువూ సంస్కరణలు & అభివృద్ధి రాజకీయ కోణమే. బాడీ లాంగ్వేజ్‌లో రాజకీయం. చూపులో రాజకీయం. నవ్వులో (ఒకవేళ పొరపాటున నవ్వితే) రాజకీయం. మాటలో రాజకీయం. పలకరింపులో రాజకీయం. సంస్కరణలు & అభివృద్ధి 'రాజకీయాని'కి పర్యాయ పదం – చంద్రబాబు నాయుడు.

ఆయనను హ్యాండిల్ చేయడం అన్నది మామూలు పొలిటీషియన్లకు అయ్యే పని కాదు. ఆయనను కాళ్ళు చేతులు కట్టేసి.... సముద్రంలో బాగా లోపలికి తీసుకెళ్లి వదిలేస్తే... చేపలన్నిటినీ పోగేసి, గుడ్లు ఎక్కువగా ఎలా పెట్టాలో నేర్పి, ఏ దేశానికి చేప పిల్లల్ని అమ్మితే డబ్బులు ఎక్కువగా వస్తాయో వాటికి చెప్పి... వాటితోనే సేవలు చేయించుకుంటారు. సముద్రంలోనే సంపద సృష్టిస్తారు. ఎవరికి నచ్చినా... నచ్చకపోయినా... గెలుపోటములతో సంబంధం లేకుండా... తెలుగు రాజకీయాలలో అత్యంత మన్నికైన రాజకీయ నాయకుడు చంద్రబాబునాయుడు.

'సమస్యలో నుంచే అవకాశం సృష్టి...!' అనేది – చంద్రబాబునాయుడు ఫిలాసఫీ. ఆయన పేరుకు కూడా అదే అడుగున ట్యాగ్ లైన్.

పదవి ఉండడం... ఉండక పోవడంతో ఆయనకు సంబంధం లేదు. వచ్చినప్పుడు వస్తుంది. రానప్పుడు... రాదు.

గత నలభై ఏళ్ళల్లో ఎంతోమంది నేతలు.... చంద్రబాబును రాజకీయంగా తెర మరుగు చేద్దామని గట్టి ప్రయత్నాలే చేశారు గానీ... వాళ్లకు 'వర్క్ అవుట్' కాలేదు. వాళ్ళే తెరమరుగైపోయారు. నాదెండ్ల భాస్కరరావును మించిన ఉదాహరణ ఏముంటుంది, ఈ విషయం చెప్పడానికి!

ఆయన రాజకీయ చదరంగం బాగా తెలిసిన 'మృత్యుంజయుడు' కావడమే ఇందుకు కారణం.

చిరుతపులి లాంటి తీక్షణమైన కంటిచూపు కలిగిన కళ్ళతో... తనకు ఎదురయ్యే 'సమస్య'లను ఒడుపుగా పట్టుకుని, వాటిల్లోంచి ఓ అద్భుత అవకాశాన్ని సృష్టించుకుంటారు చంద్రబాబు. ఆ మాట ఆయనే అనేకసార్లు చెప్పారు, ' సమస్యలు వస్తే... బెదిరిపోను. వాటిల్లోంచే అవకాశాలు సృష్టించుకుంటాను' అని.

ఇప్పుడు, రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొన్న తరుణంలో.. ఆయనను అరెస్ట్ చేసి, రాజమండ్రి జైలులో పెట్టారు.

నిజానికి, తెలుగుదేశం పార్టీకి ఇది అతిపెద్ద సమస్య. ఇంతకుమించిన సమస్య చంద్రబాబు జీవితకాలంలో తెలుగుదేశం పార్టీకి ఇక రాకపోవచ్చు.

ఈ సమస్యను ఒక సాకుగా చూపి, తెలుగుదేశం పార్టీ అతిపెద్ద అవకాశాన్ని చేజిక్కించుకుంది. వచ్చే ఎన్నికల లోపు ఇంతకుమించిన గొప్ప 'అవకాశం' కూడా తెలుగుదేశం పార్టీకి మరోటి రాకపోవచ్చు. తెలుగుదేశం కార్యకర్తలకు, నాయకులకు, సానుభూతిపరులకు, శ్రేయోభిలాషులకు ఇది ఒక భావోద్వేగ సమస్య కూడా.

- వివాహమైన తరువాత.... నారా భువనేశ్వరి గానీ, నారా బ్రాహ్మణి గానీ రాజకీయంగా రోడ్లమీదికి రావడం ఇదే మొదటిసారి. ఒకరు ఎన్‌టీ రామారావుకి ఇష్టమైన కనిష్ఠ పుత్రిక అయితే, మరొకరు ఆయన మనుమరాలు.
- ఇంత కాలమూ కొంత ఊగిసలాట ధోరణితో మాట్లాడుతూ... వ్యవహరిస్తూ... ఒక అడుగు ముందుకు, అడుగున్నర వెనక్కు వేస్తూ వచ్చిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజమండ్రి సెంట్రల్ జైలు లోపలికి వెళ్లి, 45 నిముషాలు చంద్రబాబునాయుడుతో గడిపి, బయటకు వచ్చి... 'ఎస్! జనసేన టీడీపీతో కలిసి పోటీ చేస్తుంది. రేపటి నుంచే ఉమ్మడిగా పోరాటాలు చేస్తాం!' అని విస్పష్టంగా, నిర్ద్వంద్వంగా 'సింహనాదం' చేశారు. ఆయన ఆ రకమైన విస్పష్ట ప్రకటన చేయడం... 2014 ఎన్నికలు ముగిసిన తరువాత ఇదే మొదటిసారి. రాష్ట్ర రాజకీయ గమనంలో ఇదో కీలక మలుపు.
- అదే ఊపులో వెళ్లి, భువనేశ్వరిని, బ్రాహ్మణిని పవన్ కళ్యాణ్ పరామర్శించి వచ్చారు. అలా చేయడానికి ఎంతో రాజకీయ పరిణతి, అవగాహన, ఆత్మవిశ్వాసం, రాజకీయంపై కమాండ్ కావాలి.
- రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా ధర్నాలు, నిరాహార దీక్షలు, ఊరేగింపులు జరుగుతున్నాయి. ఇవి కేవలం టీడీపీయులకే పరిమితం కాదు. 'పబ్లిక్ పెర్సెప్షన్'ను ఇవి తీవ్రంగా ప్రభావితం చేస్తాయి.
- పైపెచ్చు, జీతాలుగా లక్షలు తెచ్చుకునే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు... బాగా చదువుకున్న ఆడ, మగ పిల్లలు కూడా రోడ్లు ఎక్కారు. గతంలో ఓ రాజకీయ నాయకుడు అరెస్ట్ అయితే, ఈ రకమైన స్పందన ఎప్పుడూ కనపడలేదు. దీంతో, వెళ్ళువల






సిన మెసేజ్ ఏదో జనంలోకి బలంగా వెళ్ళిపోయింది.

- మన రాష్ట్రంలోనే కాదు, అమెరికా, ఇంగ్లండ్, మలేసియా లాంటి దేశాల్లోనూ నిరసనలు చోటు చేసుకున్నాయి.
- చంద్రబాబు అరెస్ట్‌పై జాతీయ మీడియాలోనూ చర్చలు, విశ్లేషణలు వెలువడ్డాయి.
- చంద్రబాబు అరెస్ట్‌పై దేశవ్యాప్తంగా అనేక మంది నాయకుల అసహన ప్రకటనలు జనంలోకి వెళుతున్నాయి. తమిళ సూపర్‌స్టార్ రజనికాంత్ సైతం ఈ అరెస్ట్‌పై స్పందించారు.
- సీఐడీ అదనపు డీజీ సంజయ్, అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకరరెడ్డి చేసే పత్రికా ప్రకటనలు అంత లాజికల్‌గా లేవని జనం అంటున్నారు.
- ఢిల్లీ యాత్రలో లోకేష్ పరిపక్వతతో వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు మీడియాలో గట్టిగానే వస్తున్నాయి... వీటన్నిటి విలువ వీటికుంటుంది కదా!

ఇవన్నీ, చంద్రబాబు అరెస్ట్ తెలుగుదేశంకు సృష్టించిన 'అవకాశాలే'. ఆ ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయాధికారి హిమబిందు గానీ, చంద్రబాబుకు జ్యుడీషియల్ రిమాండ్ విధించకపోయి ఉన్నట్టయితే... ఇంత పొలిటికల్ మైలేజ్ తెలుగుదేశం పార్టీకి వచ్చి ఉండేది కాదు. ఆమెకు తెలుగుదేశం పార్టీ కృతజ్ఞతలు చెప్పుకోవాలి. న్యాయధికారి హిమబిందు వయసులో చిన్న అయినప్పటికీ.... పెద్ద మనసుతో తీసుకున్న నిర్ణయం తెలుగుదేశం పార్టీకి గొప్ప అవకాశం అందించింది. వైసీపీకి సంబంధించినంతవరకు... 'ఆపరేషన్ సక్సెస్. బట్, పేషెంట్ డైడ్' అని చెప్పుకోవచ్చు.



'చంద్రబాబును జైలులో పెట్టించ గలిగాం' అనే తృప్తి వైసీపీకి ఉండవచ్చు గానీ, దానివల్ల టీడీపీకి భారీ పొలిటికల్ మైలేజ్ లభించింది.

నిజానికి. 2014 – 2019 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేత అనేక తప్పులు చేయించారు. దానివల్ల చాలా సామాజిక వర్గాలు తెలుగుదేశం పార్టీకి దూరం అయ్యాయి. దీనికితోడు, 2014లో 'లక్ష్యం' సాధించడంలో విఫలమైన జగన్, అనూహ్య వ్యూహాలకు పాదయాత్రను జోడించి.... రాష్ట్రాన్ని చుట్టుముట్టడానికి సామ దాన, భేద, దండోపాయాలను ప్రయోగించారు. పవన్ కళ్యాణ్ రాజకీయ అపరిపక్వత, రాజకీయానుభవ రాహిత్యం కూడా జగన్ వ్యూహాలకు 2019లో తోడైంది. ఫలితంగా 175 స్థానాలకు 151 స్థానాలు సాధించారు. లోక్‌సభ 25 స్థానాలకు 22 లభించాయి.

ఈ విజయంపై వైసీపీ అగ్రనేతలు ఆత్మావలోకనం చేసుకుని ఉండవలసింది.

"మనకు ఇంత భారీ విజయం ఎందుకు లభించింది? మన నుంచి ప్రజలు ఏమి ఆశించి ఇంత భారీమద్దతు ఇచ్చారు? తెలుగుదేశం పార్టీని ఇంత దారుణంగా ఎందుకు దెబ్బతీశారు? ప్రజల అంచనాలను అందుకోడానికి మనం ఏమి చేయాలి? అందుకు అవసరమైన వనరులు మన దగ్గర ఉన్నాయా? లేకపోతే ఏమి చేయాలి.. తెలుగుదేశం పార్టీ పని అయిపోయినట్టేనా? భవిష్యత్‌లో దాని నుంచి రాజకీయంగా సవాలు ఎదురయ్యే అవకాశం ఉందా? దాని నుంచి సవాలు ఎదురైతే ఎలా హ్యాండిల్ చేయాలి" వంటి అనేక అంశాలపై ఒక మదింపు, దీర్ఘకాలిక ప్రణాళిక వైసీపీ చేసుకుని ఉండవలసింది. అటువంటి మదింపు జరిగినట్టుగా గుర్తేలేదు. వైసీపీ హైకమాండ్లో సంప్రదాయ పొలిటిషియన్స్ బాగా తక్కువగా ఉండడం ఇందుకు ఓ కారణం అయితే అయి ఉండవచ్చునని టీడీపీ ప్రభుత్వంలో సీనియర్ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు.

దీంతో, 15... 20 ఏళ్ళల్లో పాలకపక్షంపై ప్రజలలో కనిపించాల్సిన వ్యతిరేకత... వైసీపీ పాలనలో మొదటి టర్మ్‌లోనే కనిపిస్తోంది.

ఫలితంగా, చంద్రబాబునాయుడికి ఇప్పుడు అయాచితంగా కలిసివచ్చిన 'అవకాశం' ఇది. నందమూరి బాలకృష్ణను, నారా లోకేష్‌ను చెరోపక్కన నిలబెట్టుకుని... రాజమండ్రి సెంట్రల్ జైలు మెయిన్ గేట్ ముందు... మీడియాతో సాధికారికంగా మాట్లాడడానికి పవన్ కళ్యాణ్‌కి వచ్చిన 'అవకాశం' ఇది. నారా లోకేష్ ఢిల్లీ వెళ్లి, జాతీయ మీడియా ప్రముఖులతో మాట్లాడడానికి వీలు కలిగింది.

తన అధికారానికి మూడో ఎన్నికల్లోనో... నాలుగో ఎన్నికల్లోనో ఎదుర్కోవలసిన సవాలును, వైసీపీ మొదటి టర్మ్‌లోనే ఎదుర్కొంటోంది. ఇప్పటికైతే, తన అరెస్ట్ అనే సమస్య నుంచి చంద్రబాబు నాయుడు ఒక అవకాశాన్ని సృష్టించుకున్నారు.

అయితే, ఈ 'అవకాశం' తోక పట్టుకుని, తెలుగుదేశం పార్టీ ఎన్నికల గోదారిని విజయవంతంగా ఈదగలదా అనే విషయంలో ఎవరి సందేహాలు, అనుమానాలు, డౌట్లు, అభిప్రాయాలు, వ్యాఖ్యానాలు వారివి. లోకోః భిన్న రుచి అన్నారుగా పెద్దలు!

- భోగాది వేంకట రాయుడు
శాన్ఫ్రాన్సిస్కో నుండి...
medhomadhanam@gmail.com

# శ్రీసిటీలో.. రిపబ్లిక్ ఆఫ్ కొరియా కాన్సుల్ జనరల్

## పెట్టుబడులు పెట్టేందుకు అనువైనదిగా శ్రీసిటీకి ప్రశంస




అంతర్జాతీయఖ్యాతి గాంచిన పరిశ్రమల సిటీగా పేరొందిన శ్రీసిటీలో ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణం పుష్కలంగా ఉన్నాయని, పెట్టుబడులు పెట్టేందుకు అనువైన ప్రాంతం శ్రీసిటీ అని..రిపబ్లిక్ ఆఫ్ కొరియా కాన్సుల్ జనరల్ ప్రశంసించారు. చెన్నైలోని రిపబ్లిక్ ఆఫ్ కొరియా కాన్సుల్ జనరల్ చాంగ్-న్యున్ కిమ్ ఈనెల 20న శ్రీసిటీని సందర్శించారు. రిపబ్లిక్ ఆఫ్ కొరియా రాయబార కార్యాలయం ఆధ్వర్యంలో నడిచే లాభాపేక్షలేని సంస్థ కొరియా ట్రేడ్-ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ(కోట్రా) చెన్నై శాఖ డైరెక్టర్ మిన్ హ్యోంగ్ లీ, కొరియన్ కాన్సులేట్ పరిశోధకుడు జూన్ సిక్ హ్వాంగ్‌తో కలిసి ఈ పర్యటనలో పాల్గొన్నారు. శ్రీసిటీ అభివృద్ధి, పెట్టుబడులకు అనుకూల వాతావరణం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కిమ్, శ్రీసిటీలో కొరియన్ కంపెనీల పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. శ్రీసిటీని సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. శ్రీసిటీ నమూనా చాలా ప్రత్యేకంగా ఉందని, భారతదేశంలో ఇటువంటి పారిశ్రామికవాడలు చాలా అరుదు అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా శ్రీసిటీలోని పరిశ్రమలకు అందజేస్తున్న మౌలిక సదుపాయాలు, శ్రీసిటీ ప్రత్యేకతలు, వేగవంతమైన అభివృద్ధి గురించి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి విశదీకరించారు. వివిధ పరిశ్రమలలో పెట్టుబడి అవకాశాలు, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అందించే ఆర్థిక ప్రయోజనాలు, శ్రీసిటీలో పరిశ్రమలు ఏర్పాటు వల్ల కలిగే ఇతర ప్రత్యేక ప్రయోజనాలను ఆయన వివరించారు. శ్రీసిటీని సందర్శించినందుకు కాన్సుల్ జనరల్ మరియు ఆయన బృందానికి కృతజ్ఞతలు తెలుపుతూ, రిపబ్లిక్ ఆఫ్ కొరియా సుమారు 5.4 బిలియన్ల పెట్టుబడులతో భారతదేశానికి 13వ అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిదారు (ఎఫ్‌డిఐ)గా నిలిచిందన్నారు. ఇప్పటికే శ్రీసిటీలో 3 కొరియన్ కంపెనీలు ఉన్నాయని గుర్తు చేశారు. కాన్సుల్ జనరల్ పర్యటన ప్రభావంతో భవిష్యత్తులో దక్షిణ కొరియా పారిశ్రామిక పెట్టుబడులు పెరగడానికి మార్గం సుగమం కాగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం, కాన్సుల్ జనరల్ హ్యుందాయ్ ఇంజినీరింగ్ ప్లాస్టిక్స్ (హెచ్‌డిసి), ఎస్ కె పుకోర్ పరిశ్రమలతో పాటు నిర్మాణ దశలో వున్న ఎల్‌జి పాలిమర్స్ పరిశ్రమను సందర్శించి, అక్కడ పనితీరును పరిశీలించారు. కొరియన్ కంపెనీల సీఈఓలు, సీఎక్స్ఓలతో అభివృద్ధి విషయాలపై చర్చించారు.











Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com